RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 27 ఫిబ్రవరి 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:227

## వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు....



వార్తా 3 లో

# తెలంగాణ ప్రజలు

## ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని ఒప్పుకోరు.. సీఎం రేవంత్ రెడ్డి







**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**శిక్షణ ను విజయవంతం గా పూర్తి చేసిన అధికారులకు అభినందనలు..

మీరు మొన్న విద్యార్థులు,నిన్న నిరుద్యోగులు,ఈ రోజు అధికారులు ..

ప్రజా పాలన లో 4 కోట్ల తెలంగాణ ప్రజలకు మీరు సేవలు అందించబోతున్నారు..

తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని ఒప్పుకోరు..

రాంజీ గోండు,కొమరం భీం రాజ్యాల కోసం పోరాటం చేయలేదు..అధిపత్యం చెలాయిస్తున్న వారిపైన తిరుగుబాటు చేశారు

కాకతీయ సామ్రాజ్యం పైన సమ్మక్క సారలమ్మ తిరుగుబాటు చేశారు..

అందుకే వారు వనదేవతలుగా గౌర్వించబడుతున్నారు

సామాజిక న్యాయం, సమానత్వం,స్వేచ్ఛ,సమాన అవకాశాల కోసం వారు అమరవీరులు అయ్యారు..

అధికారులుగా బాధ్యతలు సేకరిస్తున్న మీరు ప్రజల ఆకాంక్షలు,అమరవీరుల స్ఫూర్తి గుర్తు పెట్టుకోవాలి..

మొదటి ఎన్నికల్లో దేశం లోనే అత్యదిక మెజార్టీ తో గెలిచిన రావి నారాయణ రెడ్డి తెలంగాణ బిడ్డ..

6 లక్షల మంది పోటీపడితే 582 మంది గ్రూప్ 1,775 మంది గ్రూప్ 2 ఉద్యోగాలు సాధించారు..

15 ఏళ్ల పాటు గ్రూప్ 1 ఉద్యోగాలు భర్తీ చేయలేదు

ప్రజా ప్రభుత్వం గ్రూప్ 1 నిర్వహించి ఆకాంక్షలను నెరవేర్చింది..

టీ జీ పీ ఎస్ సీ ని ప్రక్షాళన చేశాం..

గ్రూప్ పరీక్షల పైన అవగాహన ఉన్న వాళ్ళని చైర్మన్ గా,సభ్యులుగా నియమించాం..

ప్రశ్నా పత్రాలు జిరాక్స్ సెంటర్ లలో అమ్మేందుకు అవకాశం లేకుండా చేశాం..

గ్రూప్ 1 నికి ఎంపికైన ఆనందం 24 గంటలు లేకుండా గిట్టని వాళ్ళు కోర్ట్ కు వెళ్లారు..

అభ్యర్థులు ఒక్క తప్పు చేయలేదు,మెరిట్ మీద ఎంపిక అయ్యారని ప్రభుత్వం భావించి సుప్రీంకోర్టు వరుకు వెళ్లి కొట్లాడింది..

అధికారులు అయ్యాక బాధ్యత మరిచి పోయి మనిషిగా పతనం కావద్దు..

సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరవేసే బాధ్యత మీదే..

ప్రభుత్వానికి కళ్లు,చెవులు మీరు..

నేను మెకానికల్ గా మిమ్మల్ని కలవలేదు..ఎమోషనల్,అటాచ్మెంట్ తో కలిశాను..

ఆఫీస్ కు వెళ్ళేముందు ఎస్ ఆర్ శంకరన్ ను తలచుకోవాలి

పేదవారికి సాయం చేసేముందు తల్లితండ్రులను గుర్తు పెట్టుకోవాలి..

తల్లి తండ్రుల ను గౌరవించాలి

తల్లి తండ్రులను పట్టించుకోని వాళ్ల జీతం లో 10 నుండి 15 శాతం కోత పెట్టేలా అసెంబ్లీ లో చట్టం చేయబోతున్నాం..

త్వరలోనే హార్వర్డ్ యూనివర్సిటీ,ఎం సీ హెచ్ ఆర్ డీ మధ్య ఒప్పందం..

హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి వచ్చి ఎం సీ హెచ్ ఆర్ డి లో శిక్షణ ఇస్తారు..

# పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్

**వెలుగుమెట్లలో 2023లో ఇళ్లు కూలగొట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వమే**

**బాధితులకు ఇంటిస్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది**

**ప్రభుత్వ ప్రగతిని చూడలేని కేసీఆర్ ఢ కో విష ప్రచారం**

**వరుస ఎన్నికల్లో ప్రజల బుద్ది చెబుతున్నా మారని బిఆర్ఎస్ వైఖరి**

**కాళేశ్వరం ప్రాజెక్ట్ లో బిఆర్ఎస్ అవినీతికి బిజేపీ సహకారం**

**కేసీఆర్ అసెంబ్లీకి రావాలి- మంచి సలహాలు సూచనలు ఇవ్వాలి**

**మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ స్పష్టీకరణ**



హైదరాబాద్:- రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని, దీనికి మరోవైపు బిజేపీ నేతలు వంతపాడుతున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు.

గురువారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్, రామ సహాయం రఘుమారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, మాధవరెడ్డితో కలసి మాట్లాడారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ...2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని చెబుతూ నాడు కూల్చివేత సంఘటనల ఫోటోలను ప్రదర్శించారు.

అంతేగాక వెలుగుమెట్లలో పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసింది. కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇండ్లను



తొలగించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇళ్లు ఇస్తాం. పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పెటెంట్. ఈవిషయంలో నిజంగా పేదలపై బిఆర్ఎస్ బావ మరుదులు, ఫాంహౌస్ లో ఉండి కుట్రలు చేస్తున్న కేసీఆర్ వెంటనే స్పందించి కాళేశ్వరంలో దోచుకున్న, దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ ను చేపట్టి ఎనిమిదవ వింతగా ప్రచారం చేసుకుంది. వారి హయాంలోనే లక్షలాది కోట్ల ప్రాజెక్ట్ కట్టడం, అవినీతి కారణంగా బీటలువారడం కూడా జరిగింది. నాలుగేళ్లలో 168 టిఎమ్‌సీ నీరు ఇస్తామని చెప్పి దీనిలో 50 టిఎంసీల నీటిని సముద్రం పాలుచేశారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ బిఆర్ఎస్ కు ఎటీఎం గా మారిందన్న బిజేపీ నేతలు బిఆర్ఎస్ తో చేతులు కలిపారు. జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదిక ఇచ్చినా, అసెంబ్లీలో తీర్మానం చేసి సిబిఐకి ఇచ్చినా ఇంతవరకు కేంద్రం కనీసం స్పందించలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్ట్ లను మేం పూర్తి చేస్తున్నాం. 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలి. వారు గతంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మేం కచ్చితంగా అవకాశం ఇస్తాం.వచ్చి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..బిఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్ట్‌ల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసింది. 196 టిఎంసీల నీరు ఇస్తామని చెప్పి 168 టీఎంసీలకు పరిమితం చేసింది. 50 టీఎంసీలు సముద్రంలో కలిపింది. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. మా ప్రభుత్వం వచ్చాక శ్వేత పత్రం ఇచ్చాం. కాళేశ్వరంపై చర్చించాం. కేంద్రం చర్యలు కోరాం. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 48వేల కోట్లు మిత్తీగా కట్టింది. కేంద్రప్రభుత్వం ఇకనైనా నిధులు ఇవ్వాలి అని కోరారు.

మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ .. బిఆర్ఎస్ పార్టీ అవినీతికి పాల్పడినందును దేశంలోని ప్రాంతీయ పార్టీల్లోకెల్లా ధనిక పార్టీగా మారింది.సుమారు వెయ్యి కోట్ల రూపాయిల ఫిక్స్‌డ్ డిపాజిట్లు , ఎలక్ట్రోరల్ బాండ్లు దీనికి నిదర్శనం. కాళేశ్వరం ప్రాజెక్ట్ కారణంగా ఏర్పడిన నష్టాన్ని కేసీఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్టర్లు, కాసుల కోసమే బిఆర్ఎస్ అనుకూల నీటిప్రాజెక్ట్‌లను చేపట్టింది.

# అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్ గా తెలంగాణ...


**2047 నాటికి ఈ రంగంలో తిరుగులేని శక్తిగా రాష్ట్రం ,ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు**

**'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు**





తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్ లల్లో ఒకటిగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆ దిశగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ఇంటిగ్రేషన్, పాలసీ అండ్ రెగ్యులేటరీ ఫెసిలిటేషన్, సస్టైనబిలిటీ అండ్ గ్రీన్ లాజిస్టిక్స్, స్కిల్ డెవలెప్ మెంట్ అండ్ ఇన్నోవేషన్ తో కూడిన 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ముంబై లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో 'మెస్సే ముంచెన్ ఇండియా(మెస్సే ముంచెన్ జర్మనీ అనుబంధ సంస్థ)' నిర్వహిస్తోన్న 'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించే కీలక రంగాల్లో ప్రధానమైన 'లాజిస్టిక్ రంగం'లో 2047 నాటికి తెలంగాణను తిరుగులేని శక్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. భౌగోళిక విస్తీర్ణంలో పదకొండు, జనాభాలో పన్నెండో స్థానంలో ఉన్న తెలంగాణ వాటా దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉందన్నారు. దీనిని 2047 నాటికి 10 శాతానికి పెంచాలనే సంకల్పంతోనే 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ కు శ్రీకారం చుట్టామన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చేర్చాలనే లక్ష్య సాధనలో లాజిస్టిక్ రంగానిదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసుల పునర్నిర్మాణం, ఏఐ ఆధారిత ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్, సస్టైనబిలిటీ అనే మూడు ప్రధాన మార్పులు లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో భౌగోళికంగా మనకున్న అనుకూలతలను 'డిజైన్ అడ్వాంటేజ్'గా మార్చుకుని సత్తా చాటేలా ముందుకెళ్తున్నామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో ఫేజ్ -- 2, కొత్త ఎయిర్ పోర్టులు, డ్రై పోర్టు, తెలంగాణ లాజిస్టిక్స్ పాలసీ 2.0, లాజిస్టిక్ హబ్స్ తదితర ప్రాజెక్టులు ఈ రంగంలో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా మార్చుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్ ను తయారు చేస్తున్నామని పునరుద్ఘాటించారు. కేవలం వస్తువులను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని ప్రపంచం ఊహించని వేగంతో డెలివరీ చేసి 'లాజిస్టిక్ పవర్ హౌస్'గా ఎదిగే సత్తా తెలంగాణకు ఉందని స్పష్టం చేశారు. మల్టీ మోడల్, రైల్ లింక్డ్ అసెట్స్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ -- ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర కేటగిరీల్లో పెట్టుబడులు పెట్టి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. వేగవంతమైన అనుమతులు, పారదర్శకమైన పాలసీలు, ప్రోత్సాహకర విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

గురువారంనాడు లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ని మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క వచ్చే నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న నా కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వారికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించడం జరిగింది

# ప్రజాబలం

27 ఫిబ్రవరి 2026 శుక్రవారం


## ఓటింగ్ కు ఏఐ మిక్సింగ్

భారత ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. అయితే వలసలు, అనారోగ్యం లేదా ఇతర అనివార్య కారణాల వల్ల లక్షలాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా బిహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం 'కృత్రిమ మేధ' 'బ్లాక్‌చెయిన్' సాంకేతికతలతో కూడిన ఇ-ఓటింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. 2026లో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో ఈ విధానాన్ని ప్రదర్శించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.ఇందుకోసం ఢిల్లీ భారత మండపంలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఇది 27 ఏళ్ల తర్వాత కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు మధ్య జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశం. ఈవీఎంలు, ఓటర్ల జాబితాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంపై అంశాలపై అధికారులు చర్చలు జరపనున్నారు. చివరిసారిగా ఇలాంటి సమావేశం 1999లో జరిగింది.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షత వహిస్తారు. ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు డాక్టర్ వివేక్ జోషి సమక్షంలో ఈ సమావేశం జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు, చట్టపరమైన, సాంకేతిక నిపుణులు పాల్గొంటారు. మొత్తం 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారులు పాల్గొనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ల పనితీరు, ఎన్నికల ప్రక్రియలు, లాజిస్టిక్స్ ను పెంపొందించడం, నిర్మాణాత్మక ఆలోచనల మార్పిడికి ఎన్నికల నిర్వహణలో సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడం అంశాలపై చర్చలు జరగనున్నాయి.ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంతో పాటు, సాంకేతికత, ఈవీఎంలు, ఓటర్ల జాబితా అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఇటీవల ప్రారంభించినడిజిటల్ ప్లాట్‌ఫామ్, ఎన్నికల సేవలను క్రమబద్ధీకరించడంలో మార్పులు, సాంకేతికత వినియోగ కార్యాచరణ కార్యక్రమాలపై ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పటిష్టత, పారదర్శకత, భద్రత అంశాలపై రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు సీనియర్ ఎన్నికల అధికారులు..అన్ని ప్రాంతాలలో ఓటర్ల జాబితా తయారీని నియంత్రించే చట్టపరమైన మార్గదర్శకాలను సులభతరం చేయడానికి, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950కి సంబంధించి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఓటర్ల అర్హతపై చర్చలు జరగనున్నాయి. ఆర్టికల్స్ 243ఐ, 243జెం ప్రకారం పంచాయతీలు, మున్సిపల్ సంస్థలకు ఎన్నికల జాబితా తయారీ, నిర్వహణ పర్యవేక్షణ, దిశానిర్దేశం నియంత్రణను రాష్ట్ర ఎన్నికల కమిషన్లు కలిగి ఉన్నాయి. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియ సహా త్వరలో జమిలి ఎన్నికల పై చర్చ జరుగుతున్న నేపథ్యం కేంద్ర రాష్ట్ర ఎన్నికల అధికారుల సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.ద్యోగాల కోసం ఇతర నగరాలకు వెళ్లే కార్మికులు, దూర ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు, అలాగే శారీరక ఇబ్బందులు ఎదుర్కొనే వృద్ధులు, వికలాంగులకు ఈ విధానం ఒక వరంలా మారనుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే, తమ వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారానే సురక్షితంగా ఓటు వేసే వెసులుబాటును ఈ ఇ-ఓటింగ్ యాప్ కల్పిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో తగ్గుతున్న ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా బిహార్ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ ఉప ఎన్నికల్లో దీనిని విజయవంతంగా పరీక్షించింది. ఈ ఓటింగ్ సాంకేతికతతో పకడ్బందీ భద్రత డిజిటల్ ఓటింగ్ అనగానే భద్రతపై అనేక అంచనాలు ఉంటాయి. అందుకే బిహార్ ఎన్నికల సంఘం అత్యున్నత స్థాయి రక్షణ చర్యలను చేపట్టింది: ఫేషియల్ రికగ్నిషన్: ఓటరు గుర్తింపు కార్డు డేటాబేస్ ఆధారంగా ముఖ గుర్తింపు ప్రక్రియ ద్వారా అసలైన ఓటరును గుర్తిస్తారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ: వేసిన ప్రతి ఓటు ఎన్‌క్రిప్ట్ చేయబడి బ్లాక్‌చెయిన్‌లో రికార్డ్ అవుతుంది. దీనివల్ల డేటాను ఎవరూ ట్యాంపర్ చేయడం లేదా మార్చడం అసాధ్యం. డిజిటల్ ఈవీఎం: స్మార్ట్ కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా డిజిటల్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రిటర్నింగ్ అధికారి డిజిటల్ సిగ్నేచర్ ఉంటేనే డేటా డీక్రిప్ట్ అవుతుంది. ఓటు వేయడం ఇప్పుడు సులభం ఓటర్లు ముందుగా అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఓటీపీ ద్వారా మొబైల్‌ను ధ్రువీకరించుకోవాలి. ఆపై ఎపిక్ కార్డు వివరాలు నమోదు చేసి, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా తమను తాము ధ్రువీకరించుకున్న తర్వాత నేరుగా ఓటు వేయవచ్చు. ఈ ప్రక్రియ అంతా అత్యంత రహస్యంగా, పారదర్శకంగా సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏదైనా కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు సహజం. పాత ఫోటోలు స్పష్టంగా లేకపోవడం, ఇంటర్నెట్ అంతరాయాలు, డిజిటల్ అక్షరాస్యత లేకపోవడం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ.. బిహార్ ఎన్నికల సంఘం నమూనా ఓటింగ్ ద్వారా ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో నమ్మకాన్ని కలిగించగలిగింది. ఫలితాల లెక్కింపు కోసం కూడా ఏఐ ఆధారిత ఓసీఆర్ వ్యవస్థను వాడుతుండటం వల్ల మానవ తప్పిదాలకు తావు లేకుండా వేగంగా ఫలితాలు వెలువడనున్నాయి.. మరో వైపు ఏపీ, తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో ఓటర్ జాబితాలను సవరించబోతోంది. దీన్నే సర్ అని పిలుస్తున్నారు. అంటే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని అర్థం. ఈ సర్ ద్వారా.. కేంద్ర ఎన్నికల సంఘం.. ఓటర్ల జాబితాల్ని పూర్తిగా పరిశీలించి, తప్పులను సరిచేస్తుంది. అంటే ప్రక్షాళన చేస్తుందన్నమాట. ఇది ఏప్రిల్ నుంచి మొదలయ్యే ఛాన్స్ ఉంది.

ఈ సర్ ప్రక్రియను ఈసీ.. ఇప్పటికే బీహార్‌లో పూర్తి చేసింది. మరో 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తి చేస్తూ ఉంది. మిగతా 22 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల సంగతి చూడబోతోంది. ఇది పూర్తైతే.. ఓటర్ల జాబితాలో అక్రమాలు దాదాపు తొలగినట్లే అవుతుంది. అప్పుడు ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరాలు రాకపోవచ్చు. 2027లో కేంద్రం జనాభా లెక్కల గణన ప్రారంభించాలి అనుకుంటోంది. అప్పటికల్లా... ఓటర్ల జాబితాలను పర్ఫెక్ట్ చెయ్యాలి అని ఇఅఎ ప్లాన్ చేస్తోంది.ఈ సర్ ప్రక్రియ మొదలయ్యాక.. ఎన్నికల అధికారులు, సిబ్బందీ.. ప్రతీ ఇంటికీ వస్తారు. ఇంట్లో అందరి ఓటర్ జాబితాల్నీ చెక్ చేస్తారు. పూర్తి వివరాల్ని క్రాస్ చెక్ చేస్తారు. ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే సరిచేస్తారు. ఓటర్ల జాబితాలో పేరు ఉండి, ఆ వ్యక్తి లేకపోతే, ఆ పేరును జాబితా నుంచి తొలగిస్తారు. కాబట్టి.. వాళ్లు వచ్చే లోపే.. ఏవైనా సమస్యలు ఉంటే.. మనమే ముందుగా సరిచేసుకోవడం మేలు.ఈ సర్ ప్రక్రియ ద్వారా.. కొన్ని లక్షల ఓటర్ల పేర్లను ఈసీ తొలగిస్తోంది. బెంగాల్‌లో 58లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను తొలగించింది సీఈసీ. ఇది నచ్చని సీఎం మమతా బెనర్జీ.. రచ్చ రచ్చ చేశారు. అసలు సర్ ప్రక్రియనే రద్దు చెయ్యాలన్నారు. కానీ.. సుప్రీంకోర్టు.. సర్ కొనసాగించాలనీ.. దానికి ఎలాంటి అడ్డంకులూ సృష్టించకూడదని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇలాంటి అభ్యంతరాలు మన తెలుగు రాష్ట్రాల్లో రాకపోవచ్చు.

## గంగా-కావేరి నదుల అనుసంధానం కావాలి

## నదుల అనుసంధానం చేస్తే నీటి సమస్య తగ్గుతుంది ఎపి సిఎం చంద్రబాబు నాయుడు



అమరావతి ఫిబ్రవరి 26 నదుల అనుసంధానం చేస్తే నీటి సమస్య తగ్గుతుందనిఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. గంగా-కావేరి నదుల అనుసంధానం కావాలని అన్నారు. ఎపి అసెంబ్లీలో రాయలసీమ ప్రాజెక్టుపై చర్చ జరిగింది. ఈ విషయంపై సిఎం ప్రసంగించారు. నదుల అనుసంధానం చేసి తల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత తనదేనని, 2014-19 మధ్య రూ. 63 వేల కోట్లు ఖర్చు చేశామని తెలియజేశారు. రాయలసీమ ప్రాజెక్టుకు దశ,దిశ చూపించిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి ఎన్టిఆర్ అని..ఎపిలో కట్టిన ప్రతి ప్రాజెక్టు కూడా టిడిపి కట్టిందేనని కొనియాడారు. ప్రాజెక్టుల విషయంలో ప్రతిపక్షం క్రెడిట్ చోరీ చేస్తోందని, గతంలో నీళ్లు రాకుండా రిబ్బన్ కట్ చేశారని విమర్శించారు. తమ కుప్పంకు కూడా నీళ్లు ఇస్తున్నామన్నారని, పోలవరం లాంటి పెద్ద ప్రాజెక్టు దేశంలో మరెక్కడా ఉండదని తెలియజేశారు. పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తామని సిఎం పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర లో అనేక ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని, నాగావళి, చంపావతి, జంఝావతి ప్రాజెక్టు, చింతలపూడి ప్రాజెక్టును రెండేళ్లల్లో పూర్తి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయని, రాబోయే రోజుల్లో వర్షపాతం తగ్గొచ్చునని, మే 12న నారుమళ్లకు నీరు అందిస్తామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమం:సిఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో నేడు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సి.ఎస్ నిర్వహించారు. స్పెషల్ సి.ఎస్ లు జయేష్ రంజన్, వికాస్ రాజ్ ,సి.వీ ఆనంద్ , సంజయ్ కుమార్ , మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు.



అదేవిధంగా మార్చ్ 1వ తేదీ ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మార్చి 2వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని ఇందుకు గాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలనీ అన్నారు.

ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయితీ రాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహనిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సి.ఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయం తోపాటు హెచ్.ఓ.డి లలో ఈ-ఆఫీస్ ను అమలు చేయాలని ఆదేశించారు.

## 45 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో భాగంగా అత్యంత కీలకమైన సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) బాధ్యతలను రాహుల్ బొజ్జాకు అప్పగించారు. ఆయన జీఏడీ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తూనే, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను కూడా చూసుకోనున్నారు.సీనియర్ అధికారుల బాధ్యతల్లోనూ ప్రభుత్వం పలు మార్పులు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్‌ను, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించింది. ఆర్థిక మరియు ప్రణాళికా విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బాధ్యతలు చేపట్టనుండగా, దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఎం. హనుమంతరావుకు (దేవదాయ శాఖ కమిషనర్) అప్పగించారు.ప్రజల సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి' రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్యను నియమించడం గమనార్హం. కేవలం సచివాలయ స్థాయిలోనే కాకుండా జిల్లాల పాలనలోనూ ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. పలు జిల్లాల కలెక్టర్లను మారుస్తూ తీసుకున్న నిర్ణయంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి నియమితులయ్యారు. ఈ భారీ బదిలీల ద్వారా పాలనలో కొత్త ఉత్తేజం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వం జిల్లా యంత్రాంగంలో మార్పులతోపాటు కీలక శాఖల్లో ఉన్న అధికారులను కూడా ట్రాన్స్‌ఫర్ చేసింది ప్రభుత్వం. ఇప్పటి వరకు పరిశ్రమల, ఐటీ శాఖ స్పెషల్ సెక్రటరీగా ఉన్న సంజయ్‌కుమార్‌ను పంచాయతీ రాజ్ గ్రామిణాభివృద్ధి శాఖకు మార్చారు. పంచాయతీ రాజ్ శాఖలో ఉన్న శ్రీధర్‌ను ఐటీ, పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రటరీగా తీసుకొచ్చారు. దీంతోపాటు మైనింగ్, జియాలజీ శాఖ బాధ్యతలను ఆయనకు అదనంగా కేటాయించారు. రాహుల్‌బొజ్జాను సాగునీటి శాఖనుంచి సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేశారు. ఆయనకు బీసీ సంక్షేమ శాక అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆ శాఖ బాధ్యతలు చూస్తున్న ఈ శ్రీధర్‌ను సాగునీటి పారుదల శాఖకు మార్చారు.

ఆర్థిక, విద్యుత్ శాఖల్లో మార్పులు

ప్రభుత్వానికి అత్యంత కీలకమైన ఆర్థిక శాఖలో కూడా మార్పులు చేపట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్ సెక్రటరీగా ఉన్న గౌరవ్ ఉప్పల్‌ను ఆర్థిక, ప్రణాళిక శాఖ సెక్రటరీగా బదిలీ చేశారు. ఆయనకు తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. విద్యుత్ రంగంలో సంస్కరణల్లో భాగంగా ముషార్ అలీ ఫరూఖీని కొత్తగా ఏర్పాటు చేయనున్న మూడో డిస్కమ్‌కు సీఎండీగా నియమించారు. జితేష్ వి. పాటిల్‌ను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీగా నియమించారు.

జిల్లా కలెక్టర్లకు స్థాన చలనం

ప్రభుత్వంలోని కీలక శాఖల్లోనే కాకుండా జిల్లా కలెక్టర్లను కూడా ప్రభుత్వం మార్చింది. పది జిల్లాలకుపైగా కలెక్టర్లకు ట్రాన్స్‌ఫర్ చేసింది. జిల్లా యంత్రాంగంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా విజియేంద్ర స్థానంలో కుష్బూ గుప్తాను నియమించింది. కరీంనగర్‌కు పమేలా సత్పతి స్థానంలో కొత్త కలెక్టర్‌గా చిత్రా మిశ్రాకు బాధ్యతలు అప్పగించారు. యాదాద్రి భువనగిరికి హనుమంతురావు స్థానంలో అనురాగ్ జయంతిని తీసుకొచ్చారు. మెదక్ జిల్లాకు రాహుల్ రాజ్ స్థానంలో ప్రతిమ సింగ్‌ను తెచ్చారు. హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీష్‌ను బదిలీ చేసి చాహత్ బాజ్‌పాయ్‌కి ఛాన్స్ ఇచ్చారు. వికారాబాద్‌లో ప్రతీక్ జైన్ స్థానంలో దీపక్ తివారీని నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా అంకిత్‌ను జితేష్ వి పాటిల్ స్థానంలో తెచ్చారు. నారాయణపేట జిల్లాకు సిక్తా పట్నాయక్ స్థానంలో ప్రతీక్‌జైన్‌ను బదిలీ చేశారు.

ప్రజావాణికి యువ అధికారులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రజావాణి కార్యక్రమానికి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా డి. దివ్యను నియమించారు. అదనపు నోడల్ ఆఫీసర్‌గా ఎం సురేందర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సంతోష్‌బిఎంను దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా ఎం. హనుమంత రావును ప్రభుత్వం నియమించింది. ఆయనకు గోదావరి పుష్కరాల స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది

## మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం,ఒకరు మృతి

తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ద్విచక్రవాహనం అదుపు తప్పి పిట్టగోడను ఢీకొంది. ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాపడిన వ్యక్తిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. 30వ మలుపులో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ వెళుతుండగా ప్రమాదం జరిగింది. మురళి స్విమ్స్ అత్యవసర వార్డులో గాయపడి చికిత్స పొందుతున్నాడు. నటరాజన్ మృతి చెందాడు.

# వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు....

**పైలెట్ ప్రాజెక్టు తరహాలో నియోజకవర్గంలో ఒకటి**

**ఆరుట్ల పాఠశాల తరహాలో సకల వసతులు, రవాణా సౌకర్యం కల్పన**

**క్యూర్‌లో ఏడాదిలో సకల వసతులతో ప్రభుత్వ పాఠశాలలు సిద్ధం కావాలి..**

**99 రోజుల కార్యక్రమంలో వారం రోజులు పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు**

**ఏఐ సాంకేతికతపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ**

**ప్రాథమిక నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్**

**విశ్వ విద్యాలయాలకు నిధులు అందజేతపై నివేదిక సమర్పించండి..**

**విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**ముఖ్యమంత్రికి తెలంగాణ విద్యా విధానం నివేదిక అందజేసిన కమిషన్ సభ్యులు**

**నివేదికలో చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలు.. అమలు చేయాల్సిన అంశాలపై కేశవరావు కమిటీకి అప్పగింత**



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని సీఎం ఆదేశించారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని సీఎం పేర్కొన్నారు. ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలని సీఎం ఇంజినీర్లను ఆదేశించారు. వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. నగరంలోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలని సీఎం తెలిపారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలని సీఎం సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

కృత్రిమ మేధ ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఏఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏఐతో ప్రపంచ వ్యాప్తంగా వచ్చే మార్పులను తెలుసుకొని దాని ద్వారా వచ్చే అవకాశాలు మన విద్యార్థులే అందిపుచ్చుకునేలా మన సన్నద్ధత ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలని సీఎం పేర్కొన్నారు. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బ్రేక్ ఫాస్ట్ అందజేతకు సంబంధించి అధికారులు, హరేకృష్ణమిషన్ ప్రతినిధులకు సీఎం పలు సూచనలు చేశారు. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ప్రతి విద్యార్థికి పాలు అందజేయాలని.. ఇందుకు పాలను విజయా డెయిరీ నుంచి సేకరించాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ఎన్ని క్యాలరీలు అందజేస్తున్నామనేది తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు.

పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి కిట్ అందజేయాలని అందులో స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండాలని సీఎం తెలిపారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలం చెల్లిన కోర్సులను తొలగించాలన్నారు. పాలిటెక్నిక్, ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. మిగతా యూనివర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ఫీజు రెగ్యులటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎదుట ఉంచింది. వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలు, తెలంగాణలో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. సావధానంగా విన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఈవోల నేతృత్వంలో పాఠశాలలను పరిశీలించి ఫీజుల నిర్ణయంపై నివేదిక సమర్పించాలన్నారు.. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ స్థాయిలోని కమిటీ తుది కమిటీగా ఉండి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే ఫీజు నియంత్రణకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

తెలంగాణ విద్యా విధానంపై తాము రూపొందించిన నివేదికను తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి సమర్పించారు. అమెరికా, వియత్నాం, మలేసియా దేశాల్లో స్వయంగా పర్యటించడంతో పాటు వివిధ దేశాలు, పలు రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను పరిశీలించి నివేదిక రూపొందించినట్లు విద్యా కమిషన్ ఛైర్మన్, సభ్యులు సీఎంకు తెలియజేశారు. నివేదికలోని ఒక్కో అంశంపై ఛైర్మన్ మురళి సుదీర్ఘంగా వివరించారు. సావధానంగా ఆలకించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆయా అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ పలు సూచనలు చేశారు. అనంతరం నివేదికలో చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలు... వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయదగిన అంశాలపై నివేదిక రూపొందించే బాధ్యతను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు నేతృత్వంలోని కమిటీకి ముఖ్యమంత్రి అప్పగించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శిగా యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సమగ్ర శిక్ష నోడల్ ఆఫీసర్, డి.నాగరాజు, ఉస్మానియా విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, ప్రొఫెసర్

# దళితులకు ఉన్నత విద్యా అందించడం సర్కార్ లక్ష్యం

# త్వరలో అంబేద్కర్ టవర్ ..

**ఎస్సీ విద్యార్థులకు అత్యుత్తమ సివిల్స్ ఇ గ్రూప్-1, గ్రూప్-2 కోచింగ్ అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత.**

**ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ హైదరాబాద్లోనే**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

హైదరాబాద్ : ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు అన్ని రంగాల్లో సమాన లభించాలంటే చదువు ఒక్కటే మార్గమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

దళితులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాను అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవ నీయులు శ్రీ రేవంత్ రెడ్డి గారు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు.

బుధవారం 59 దళిత కులాల సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ భవన్ ను మరియు కాచిగూడ లోని ఎస్సీ హాస్టల్ ను సందర్శించారు.

ఈసందర్భంగామంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్ ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్‌ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సివిల్స్ కోచింగ్ కోరకు తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పాడిందని మంత్రి తెలిపారు. దళిత విద్యార్థులు ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కోచింగ్ తీసుకోవడం ఖర్చుతో కూడిన పని కావడంతో ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్‌లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ తీసుకోవడంతో పాటు మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు అడ్మిషన్ లలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని మంత్రి తెలిపారు. సివిల్స్; గ్రూఫ్--1 గ్రూఫ్--2 కోచింగ్ కోరకు మెరిట్ ఆధారంగా పారదర్శక ఎంపిక విధానం ఉంటుందని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఒక హైదరాబాద్ కు మాత్రమే పరిమితం కాకుండ తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు.

ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు రూపొందించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల ప్రతినిధిత్వం పెరిగే విధంగా ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్స్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని మంత్రి అన్నారు.

తమిళనాడు మోడల్‌లా అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. పేద విద్యార్థి నుంచి ఒక మంచి అడ్మినిస్ట్రేటర్ గా (పరిపాలకుడి గా ) తీర్చిద్దిదాలనే అనే సంకల్పంతో మా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ గారు అలాగే మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డి ఫ్యామిలీ గుడ్ బై

తిరుపతి ఫిబ్రవరి 26, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన లీడర్ గుడ్ బై చెబుతారా? వ్యూహాత్మకంగా సైలెన్స్ పాటిస్తున్నారా? అధినేత వైఖరి నచ్చడం లేదా? లేకుంటే కూటమి ప్రభుత్వం దూకుడు కారణమా? పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఇంతకీ ఎవరో నేత అంటే చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో బలమైన నేతగా ఉన్నారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి కూటమి ప్రభంజనాన్ని కూడా తట్టుకున్నారు. తాను ఒక్కడిని గెలవడమే కాదు తన సోదరుడు ద్వారకానాథ్ రెడ్డి ని తంబళ్లపల్లె నుంచి గెలిపించుకున్నారు. కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రాజంపేట ఎంపీ గాను గెలిచారు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో పెద్దిరెడ్డి ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. ఆ సాన్నిహిత్యం తోనే జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు పెద్దిరెడ్డి. గత దశాబ్ద కాలంగా బలమైన, తిరుగులేని నేతగా ఎదిగారు. పార్టీ తరపున రాయలసీమ బాధ్యతలను జగన్మోహన్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి అప్పగించారు. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు దూకుడు ప్రదర్శించిన పెద్దిరెడ్డి ఫ్యామిలీ ఇప్పుడు క్రమేపి పార్టీ కార్యకర్తలకు దూరంగా ఉంటుంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ కుటుంబం రాజీనామా చేయబోతోందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో ప్రారంభం అయింది. ప్రస్తుతం ఆ ఫ్యామిలీ ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలు చూస్తుంటే మాత్రం పార్టీ మారుతారని బలమైన ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పెద్దిరెడ్డి ఫ్యామిలీతో పాటు వారి అనుచరుల వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో పెద్దిరెడ్డి మాటే శాసనం అన్నట్టు ఉండేది. కానీ ఇప్పుడు పూర్తిగా సీన్ మారిపోయింది.మద్యం కుంభకోణంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో సుదీర్ఘకాలం రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. అటు తర్వాత పెద్దిరెడ్డి పై సైతం అనేక కేసులు తెరపైకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో దూకుడు కంటే మౌనం పాటించడమే మేలన్న నిర్ణయానికి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే చివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను సైతం నిర్వహించలేని పరిస్థితి ఆ ఫ్యామిలీది. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండటంతో జగన్ సైతం ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని వెతుక్కుంటున్నట్లు సమాచారం. అందుకే పెద్దిరెడ్డి తన దారి తాను చూసుకునే పనిలో ఉన్నారని లీకులు బయటకు వస్తున్నాయి. సాధారణంగా పెద్దిరెడ్డి లాంటి సీనియర్ నేత బయటకు వెళ్లిపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా నష్టం. కోలుకోలేని దెబ్బ కూడా. అయితే తనపై ఉన్న కేసుల ఒత్తిడి, వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా.. పెద్దిరెడ్డి కూటమి వైపు వెళ్తారా? లేకుంటే స్వతంత్రంగా వ్యవహరిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారు అనేది చిత్తూరు జిల్లా పొలిటికల్ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# అవుట్‌డోర్ మీడియా రంగాన్ని రక్షించేందుకు ఆందోళన కార్యక్రమాలు

## అవుట్‌డోర్ మీడియా జేఏసీ కార్య వర్గ సమావేశం తీర్మానం




హైదరాబాద్ ఫిబ్రవరి 26 అవుట్‌డోర్ మీడియా (టోమో) జేఏసీ సభ్యులు విజయపురి వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశమై, నూతన అవుట్‌డోర్ ప్రకటనల విధానం మరియు గౌరవ న్యాయస్థానం ఆదేశాల అమలుపై విస్తృతంగా చర్చించారు.సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గౌరవ న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నూతన విధానం రూపకల్పనపై చర్చించేందుకు సంబంధిత ప్రిన్సిపల్ సెక్రటరీ గారు మార్చి 4వ తేదీ లోపు అసోసియేషన్‌తో సమావేశం ఏర్పాటు చేయనట్లయితే, టోమో జేఏసీ ఆందోళన కార్యక్రమాలకు దిగవలసి వస్తుందని తెలిపారు. తీర్మానించిన కార్యక్రమాలు..ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం ముట్ట దించాలని, ఆరు ప్రధాన హైవే ప్రవేశ ద్వారాల వద్ద ధర్నాలు మరియు రాస్తా రోకోలు,గౌరవ ముఖ్యమంత్రిగారి నివాసం ముట్టడి,టోమో జేఏసీ సభ్యులు దశాబ్దాలుగా చట్టబద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి పన్నులు, లైసెన్స్ ఫీజుల రూపంలో ఆదాయం సమకూర్చుతున్నామని తెలిపారు. గౌరవ న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ చర్చలు నిర్వహించడంలో ఆలస్యం జరుగుతుండటంపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.అవుట్‌డోర్ మీడియా రంగాన్ని రక్షించేందుకు మరియు సమగ్ర, పారదర్శక విధానం తీసుకురావడానికే ఈ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.మార్చి 4వ తేదీకి ముందు తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి సమస్యను సఖ్యంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# మూసీ గోస –బీజేపీ భరోసా పరామర్శ యాత్ర

## కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బలవంతపు చర్యలను నిలిపివేయాలి

## బాధితులకు న్యాయం చేయాలి

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ్ చందర్ రావు డిమాండ్

హైదరాబాద్ ఫిబ్రవేరి 26 ;కాంగ్రెస్ ప్రభుత్వపు బలవంతపు కూల్చివేతలకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన "మూసీ గోస – బీజేపీ భరోసా" పరామర్శ యాత్ర ప్రస్తుతం మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్వహించారు.గురువారం ఉదయం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ్ చందర్ రావు బాపూఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి యాత్రను ప్రారంభించారు.అనంతరం మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులతో ముఖాముఖి సమావేశమై, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి కార్యక్రమం పేరుతో ఇళ్లు కోల్పోతున్న బాధిత కుటుంబాల ఆవేదనను తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బలవంతపు చర్యలను నిలిపివేసి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం యాత్ర గంధంగూడ, విఘ్నేశ్వర కాలనీ, కేకే కాలనీ ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఇళ్లను కోల్పోతామన్న భయంతో ఉన్న కుటుంబాలను పరామర్శిస్తూ, బీజేపీ వారి పక్షాన నిలబడుతుందని రాష్ట్ర అధ్యక్షుడు భరోసా కల్పిస్తున్నారు.అలాగే గండి మైసమ్మ ఆలయ సమీపంలో మూసీ నది పరివాహక ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ప్రభుత్వ చర్యలపై వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నారు.మూసీ శుద్ధి పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని, అభివృద్ధి ప్రజల కన్నీళ్లపై నిర్మించకూడదని బీజేపీ స్పష్టం చేస్తోంది. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.



# ఖాళీగా ఉన్న 40వేల ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలి

## నిరుద్యోగులతో విద్యాశాఖ కార్యాలయం ముట్టడి.. భారీ ధర్నా



హైదరాబాద్ ఫిబ్రవరి 26;వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా యున్న 40 వేల టీచర్ల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారి చేయాలనీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. నేడు జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో లక్డికపుల్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ర్యాగ అరుణ్ కుమార్ మరియు నీల వెంకటేష్, అనంతయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య గారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 12 వేల పాఠశాలలో ఇంగ్లీష్, మథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరు. విద్యార్థులుకు ఈ సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం లేక చదువులల్లో వెనుకబడి పోతున్నారు. దీనిలో బేసిక్ విషయ పరిజ్ఞానం లేక జాతీయ పరీక్షలలో పోటీలో నీట్, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర పోటీపరీక్షలలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్నారు. ఈ ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి బిసి జాతీయ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మార్పు గాని, చైతన్యంగానీ రావాలంటే ఉపాధ్యాయుల వలన సాధ్యమవుతుందని, మీరందరూ కూడా ప్రతి గ్రామంలో పాఠశాల ఉంటుంది బీసీల చైతన్యము తెచ్చి రాబోయే రోజుల్లో రాజ్యాధికారం లో భాగస్వాములు అయ్యేవిధంగా ఈ సమాజాన్ని చైతన్యం చేయాలని, యువతను కూడా సరైన దిశలో పయనించేటట్టు చేసే బాధ్యత మీ అందరి దన్నారు.ఈ ముట్టడి కార్యక్రమంలో నిరుద్యోగ జాక్ చైర్మన్ నీలం వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, అంజి గౌడ్, శివ కుమార్ యాదవ్, అష్మా, సురేష్, కుమార్ ఇంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పట్లూర్ మిషన్ భగీరథ లీకేజీ పైప్ లైన్ పరిశీలిస్తున్న యువ నాయకుడు నందు ప్రకాష్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 26 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూరు గ్రామంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వాటర్ సప్లై విషయంలో గాని ఎలక్ట్రిసిటీ విషయంలో గానీ గ్రామ అభివృద్ధి విషయంలో గాని మోరి కాలువలు శుభ్రం చేసే విషయంలో గానీఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్టు చూడడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు, మిషన్ భగీరథ పైప్ లైన్ విషయంలో లీకేజ్ పైపులను పరిశీలించి వెను వెంటనే మరమ్మతులు చేయించడం జరుగుతుందని యువ నాయకుడు ప్రజలకు వెన్నట్టు ఉండి సేవలు అందించే వార్డు మెంబర్ నందు ప్రకాష్ మిషన్ భగీరథ పైప్లైన్

# ఫీజుల రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

## సచివాలయంలో ఎస్ రామకృష్ణారావుకు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వినతి పత్రం



హైదరాబాద్ ఫిబ్రవరి 26 గత ఐదు సంవత్సరాలుగా రావలసిన ఏడువేల కోట్ల ఫీజుల రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని సచివాలయంలో ఎస్ రామకృష్ణారావును బీసీ జేఏసీ నేతల కలిసి వినతి పత్రం సమర్పించారు.అనంతరం మీడియాతో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఫీజుల రియంబర్స్ మెంట్ సమస్య ప్రైవేటు కళాశాల యజమాన్యాలు, ప్రభుత్వ మధ్యాన ఉన్న సమస్య కాదు 22 లక్షల పేద విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యగా ప్రభుత్వం చూడాలి ఫీజుల నిధుల విడుదల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పుని ఈ ప్రభుత్వం చేస్తుంది ఫీజుల రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నరు 5 వేల కోట్లతో గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే బదులు, పేద విద్యార్థుల ఫీజుల కోసం ఆ నిధులను కేటాయించాలి ఫీజుల బకాయిలు విడుదల చేయాలని త్వరలోనే రాష్ట్ర గవర్నర్ ను, సీఎం ను కలుస్తాంమార్చ్ 16 అసెంబ్లీ సమావేశాలు జరిగే లోపు ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీ ముట్టడిస్తాం విద్యార్థుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో విద్యార్థుల చదువుల కోసం నిధులు లేవనడం సిగ్గుచేటన్నారు.

# రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు ప్రశాంతత లేదు

## ఎప్పుడు ఎవరి ఇల్లు కూలగొడతారు..

## ఎవరి భూములు గుంజుకుంటారు..

## ఎప్పుడు అనగారిన వర్గాల మీద దాడులు జరుగుతాయో అని బిక్కుబిక్కుమంట్ బ్రతికే పరిస్థితి వచ్చింది.

## మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్.

న్యూ డిల్లీ ఫిబ్రవరి 26 రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు ప్రశాంతత లేదని,

ఎప్పుడు ఎవరి ఇల్లు కూలగొడతారు..ఎవరి భూములు గుంజుకుంటారు..ఎప్పుడు అనగారిన వర్గాల మీద దాడులు జరుగుతాయో అని బిక్కుబిక్కుమంట్ బ్రతికే పరిస్థితి వచ్చింది. మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేసారు.డిల్లీ లోని తెలంగాణా భవన్ లో మీడియా సమావేశం లో మాట్ల;ఆడుతూ .నాటి ఆంధ్రప్రదేశ్ నేటి తెలంగాణ వరకు 70 సంవత్సరాల కాలంలో రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిలు ఉండి ఉంటే హైదరాబాదులో కొన్ని వందల బస్తీలు మాయం అయ్యేవి. అందులో పేదలు ఉండే ఆస్కారం లేకుండా పోయేది. వాజ్పేయి నగర్, వెంకటస్వామి నగర్, అంజయ్య నగర్, బద్దం బాల్రెడ్డి నగర్, టైగర్ నరేంద్ర నగర్ ఇలాంటి బస్తీలే ఉండకుండా పోయేవి. ఆనాడు హైదరాబాద్ కు శ్రీకాకుళం, విజయనగరం, కరీంనగర్, అదిలాబాద్ నుంచి పొట్ట చేత పట్టుకుని జీవనం కోసం వచ్చి అసైన్మెంట్ భూములలో, దేవాలయ భూములలో, ప్రభుత్వ భూములలో, భూధన్ భూములలో గుడిసెలు వేసుకొని.. 60 గజాలు 80 గజాల్లో ఇల్లు కట్టుకొని 50 ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి స్థితి ఈరోజు లేకుండా పోయింది. ఖమ్మంలో భూధన్ భూములలో బ్రతకడానికి వచ్చిన పేదలు గుడిసెలు వేసుకొని రేకుల షెడ్డులు వేసుకొని జీవిస్తా ఉంటే అకారణంగా, చెప్పాకుండా, నోటీసులు ఇవ్వకుండా ఇంటికి ఒక డీసీఎం పంపించి.. యుద్ధభూమిని తలపించే పద్ధతిలో పదివేల మంది పోలీసులతో ప్రజల మీద చేసిన దాడి ఇల్లు కూలగొడుతున్న తీరు మహిళలు పెట్టిన కన్నీరు పద్ధతి పిల్లలు కూడా మా ఇల్లు కూలగొట్టకండి కార్చిన కన్నీళ్ల సాక్షిగా తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకుంటుంది.



## తెలంగాణలో రాజ్యసభ ఖాళీ అయిన స్థానాలు వి హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్ ఇవ్వాలి

# మల్లికార్జున్ ఖర్గేను కోరిన తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



న్యూ డిల్లీ ఫిబ్రవరి 26తెలంగాణలో రాజ్యసభ ఖాళీ అయిన స్థానాలు వి హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్ ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు.వవ మీరకు డిల్లీ లో ఏఐసిసి ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గేను కలిసి వినతి పత్రం సమర్పించారు.అనంతరం జగ్గ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రాజ్యసభ ఖాళీ అయిన స్థానాలు సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి ప్రెసిడెంట్, నటరాజ్ ఇన్చార్జ్ తో కూడా మాట్లాడాను వి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరానన్నారు.రాహుల్ గాంధీనీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చానని రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారు మల్లికార్జున కలిసి వి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరానువారికి రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరినట్లు తెలిపారు. జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్ , స్టూడెంట్ లీడర్ కమ్మ సామాజిక నుంచి ఉన్నాడు.. కమ్మ నాయకుడుగా అవకాశం ఇవ్వాలని కోరానుజెట్టి కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్, వల్ల కుటుంబం నుంచి అందరు కాంగ్రెస్ లోనే ఉన్నారుహనుమంతరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేశారు , మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారురాజీవ్ గాంధీ , సోనియాగాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారు వయసులో పెద్ద వ్యక్తి చురుకైన వ్యక్తి కాబట్టి మరో సారి అవకాశం ఇవ్వాలని కోరానన్నారు.అందుకు .ఖర్గే కమిటీలో చర్చిస్తామని హామీ ఇచ్చారు.రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని తెలిపినట్లు జగ్గ రెడ్డి తిలిపారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం








**హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధిఫిబ్రవరి 26**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" (ూతీతీఱఙవ-ూశ్రీఱఙవ) -- సురక్షిత రహదారి ప్రయాణం కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని డ్రైవర్లందరికీ భారీ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా (గురువారం) జమ్మికుంట లోని వినాయక ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం నిర్వహించబడింది. రహదారి భద్రతలో డ్రైవర్ల కంటి చూపు అత్యంత కీలకమైనదని, ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. డ్రైవర్లు తమ ఆరోగ్యంతో పాటు కంటి చూపును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని, స్పష్టమైన చూపు లేకపోవడం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడమే ఈ శిబిరం ఉద్దేశమని పేర్కొన్నారు. జమ్మికుంట మరియు పరిసర ప్రాంతాల్లోని ఆటో, క్యాబ్, లారీ, బస్సు మరియు ఇతర వాహన డ్రైవర్లందరూ దాదాపు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని వారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళు అందించామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి ,జమ్మికుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ , హుజురాబాద్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, వెంకట్ , లక్ష్మీనారాయణ,ఎస్సైలు శేఖర్ రెడ్డి , నాగరాజు , స్వాతి , సతీష్ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ప్రారంభం

## పలు ముఖ్య విషయాలు తెలియజేసిన మీడియా కన్వీనర్ ఫాదర్ గోవా శౌరయ్య సభ్యులు కె .ప్రసాద్ ఎం.ప్రసాద్



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 26 (ప్రజాబలం)** ఎదులాపురం మున్సిపాలిటీ శుక్రవారం కరుణగిరిలో ఉదయం 9:00 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు క్రైస్తవ శక్తి కలిగిన ముఖ్య ప్రసంగీకులు రెవరెండ్ ఫాదర్ జై సన్, డివైన్ మెర్సీ, మంగళగిరి బృందం వారిచే స్వస్థత ప్రార్థనలు నిర్వహించ బడతాయని తెలిపినారు ఇవి ఒకటో తేదీ సాయంత్రం వరకు కొనసాగుతాయని తెలిపినారు ఒకటవ తేదీ ఆదివారం ఖమ్మం పాత బస్టాండ్ వద్ద ఉన్న జాన్ మజ్జుకొనిచర్చి వద్ద నుండి కరుణగిరికి ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఈ ప్రదర్శన అనంతరము ఖమ్మం మాజీ బిషప్ శ్రీశ్రీ మైపన్ పాల్ చే ప్రత్యేక పూజా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు



తెలియజేసినారు 2 తారీఖున హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి పూల అంతోని రాకడ హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి కా ర్డినల్ మరియు సిబిసిఐ జాతీయ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన డాక్టర్ రెవరెండ్ పూల అంతోని గారిచే ప్రత్యేక సమిష్టి పూజ ప్రార్థన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు అన్ని ఖమ్మం పీఠాధిపతి బిషప్ సగిలి ప్రకాష్ గారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు వీరీతోపాటు ఖమ్మం వికారి జనరల్ ఫాదర్. టి .శౌరి కరుణిగిరి డైరెక్టర్ ఫాదర్ జోర్నసు ఫాదర్ ఐసక్ లు ఫాదర్లు బ్రదర్ లు సిస్టర్లు విశ్వాసులు సంఘ పెద్దలు వేలాదిగా పాల్గొంటారని తెలిపినారు ఈ నాలుగు రోజులు కరణగిరిలో వెలిసిన కరుణగిరి నాధుడు ఏసుక్రీస్తు ప్రభు యొక్క అనంతమైన ప్రేమను కృపను దీవెనలను శాంతి సమాధానము పొందడానికి ప్రజలందరినీ ఆహ్వానిస్తున్నట్లు మేత్రాసనము తరుపున ఆహ్వానించినారు ఈ సందర్భంగా 27 ,28 , 1 తేదీలలో సాయంత్రము బృంద డాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ,ఒకటో తారీకు కోలాటం పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు 28వ తేదీ, ఒకటో తేదీ లలో సాయంత్రం బుర్రకథలు ఏర్పాటు చేసినట్టు తెలిపినారు కావున భక్తులు ఈ యొక్క సదవకాశాన్ని వినియోగించుకొని ప్రభు ప్రేమలో దీవెనలతో నింపబడాలని అందరినీ ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు

## మర్పల్లి ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించిన విద్య అధికారి బి అశోక్




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 26(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి అశోక్ ఇంతవరకు విధి నిర్వహణలో బాధ్యతగా విద్యార్థులకుచక్కటి విద్యను అందించేవారు అధికారుల ఆదేశాల మేరకు మర్పల్లివిద్యాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు బి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు

# ఎన్ సీఈఆర్టీ బుక్ పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో అవినీతి గురించి ఓ అంశం చేర్చింది. అయితే, న్యాయవ్యవస్థ గురించి గతంలో మాజీ సీజేఐ చేసిన వ్యాఖ్యలను ఉటంకించడం గమనార్హం. దీనిపై తీవ్ర దుమారం రేగుతోంది. అసలు రాజకీయాలే అవినీతిక కేరాఫ్ అడ్రస్ అని, అలాంటప్పుడు వాటి గురించి ఎందుకు పుస్తకంలో పేర్కొనలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశం సుప్రీంకోర్టు దృష్టికి రాగా.. సీజేఐ కూడా తీవ్రంగా స్పందించారు. ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఎనిమిదో తరగతి సిలబస్‌లో న్యాయవ్యవస్థలో అవినీతి ' ఓ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ సంస్థ తీరుపై సుప్రీంకోర్టు మండిపడింది. ఇది అందర్నీ కలవరానికి గురిచేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఏ సంస్థను, ఏ వ్యక్తిని కించపరచడానికి అనుమతించదని, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొన్ని రోజులు ఆగితే దీనిపై సుమోటోగా విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ తీసుకొచ్చారు. ఎన్సీఆర్టీ 8వ తరగతిలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం నుంచి స్పందన వచ్చింది.సుప్రీంకోర్టు స్పందన నేపథ్యంలో పాఠ్య పుస్తకం నుంచి ఈ అంశాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించనున్నట్టు ఉన్నతస్థాయి ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. "దీనిని చేర్చి ఉండకూడదు.. అటువంటి అంశాలను హైలైట్ చేయడం సముచితం కాదు.. బదులుగా స్ఫూర్తిదాయకమైన విషయాలు పొందుపరిచి ఉండాల్సింది" కేంద్ర ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.. న్యాయవ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని, ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ జులై 2025లో చేసిన వ్యాఖ్యలను పాఠ్యాంశంలో ప్రస్తావించారు. "ప్రజలకు విశ్వాసం కల్పించడానికి పారదర్శకత, జవాబుదారీతనం ప్రజాస్వామ్య ధర్మాలు" అని ఆయన అన్న వ్యాఖ్యలను పుస్తకంలో ఉటంకించారు. సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే ప్రభుత్వ వర్గాలు ఈ అంశంపై స్పందించాయి.'ఎన్సీఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే అంశాన్ని పాఠంగా జోడించింది. మరి మంత్రులు, ప్రజా సేవకులు,దర్యాప్తు సంస్థలు సహా రాజకీయ నాయకులు భారీ అవినీతి సంగతి ఏంటి? వాటిని ఎందుకు పక్కనబెట్టాలి' అని కపిల్ సిబల్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే, కాగా, కొద్ది రోజుల కిందట 2016 నుంచి 2025 మధ్య సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై సుప్రీంకోర్టుకు 7,520 ఫిర్యాదు అందినట్టు న్యాయశాఖ నివేదిక విడుదల చేయడం గమనార్హం. దీనిపై సీనియర్ అభిషేక్ మను సింఘ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర రంగాల్లో అవినీతిని పక్కనబెట్టి కేవలం న్యాయవ్యవస్థనే వేలెత్తి చూపుతున్నారని మండిపడ్డారు.పాఠశాల స్థాయిలో విద్యలో పిల్లలకు విద్యావంతులను చేయాల్సింది పోయి ఇలాంటి సంక్లిష్టమై అంశాలను చేర్చడం ఏంటి? అని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ప్రశ్నించారు. ఎనిమిదో తరగతిలో, విద్యార్థులకు పాలనా విభాగాలు, వాటి విధులను పరిచయం చేయడమే ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన అన్నారు.

# తాకట్టులో బంగారం విడిపిస్తామంటూ మోసం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 వివిధ అవసరాల నిమిత్తం కొంతమంది బంగారం తాకట్టుపెట్టి రుణం తీసుకుంటారు. అయితే ఆ తర్వాత సరైన ఆదాయం లేకపోవడంతో ఈ రుణం పై వడ్డీ పెరుగుతుంది. ఈ సమయంలో బంగారం తీసుకోవడానికి అవకాశం ఉండదు. అయితే కొందరు తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపిస్తాం అంటూ ఇటీవల ప్రకటనలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ ప్రకటనలు పోస్టర్ల రూపంలో మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా కనిపిస్తూ ఉన్నాయి. అయితే కొందరు వీటికి అట్రాక్ట్ అయి మోసపోయిన సంఘటనలు ఉన్నాయి. తాకట్టు పెట్టిన బంగారం విడిపిస్తా అంటూ వ్యక్తుల వివరాలు పూర్తిగా తెలుసుకొని వారి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కొల్లగొడుతుంటారు. అసలు ఈ మోసం ఎలా ఉంటుందంటే?బంగారం పై రుణం లేదా బ్యాంకు నుంచి రుణం తీసుకున్న వారు.. దీని నుంచి విముక్తి పొందాలని కోరుతూ ఉంటారు. దీనిని అదును చేసుకున్న కొందరు తక్కువ వడ్డీకే కొత్తలోని ఇస్తాం అంటూ ప్రచారం చేస్తారు. అయితే ఒకవేళ ఈ ప్రకటనలకు స్పందిస్తే మోసం చేసేవారు ముందుగా తాకట్టు రసీదు, ఆధార్, ఫోటోలు పంపాలని కోరుతాడు. ఆ వివరాలు వచ్చిన తర్వాత నకిలీ ఒప్పందాన్ని చేసుకుంటారు. ఆ తర్వాత లోన్ ఆఫర్ లెటర్లు పంపిస్తారు. కానీ చివరికి అదేమీ ఇవ్వకుండా మొహం చాటేసి కనిపించకుండా పోతారు.ప్రధానంగా ఇలాంటి వాటిలో నాలుగు రకాల మోసాలు ఉంటాయి. వీటిలో మొదటిది ముందస్తు ఫీజు బస్సులు చేయడం. బంగారం విడిపిస్తామని చెప్పిన వారు ప్రాసెసింగ్ ఫీజు పేరిట ముందస్తుగా డబ్బులు వసూలు చేస్తారు. ఇందులో ఇన్సూరెన్స్, స్టాంపు చార్జీలు అంటూ అదనంగా వసూలు చేస్తారు. రెండోది బంగారం తీసుకుని పారిపోవడం వంటివి కూడా ఉంటాయి. కొందరు గ్యాంగ్ గా ఏర్పడి ఫ్రీ ప్లాన్ తో రెడీగా ఉంటారు. ముందుగా వీరిలో ఒకరు బ్యాంకుకు వెళ్లి బంగారం తీసుకొస్తామంటూ వస్తారు. ఆ తర్వాత బాధితులతో అధికార పత్రం పై సైన్ చేయించుకుంటారు. బంగారం తీసుకున్న తర్వాత ఒక్కసారిగా అదృశ్యం అవుతారు.అలాగే తాకట్టులో ఉన్న ఫైనాన్స్ కంపెనీ తమకు బాగా పరిచయం ఉందని.. సెటిల్మెంట్ చేస్తామని బాధితులను నమ్మిస్తారు. ఇందులో భాగంగా బాధితులను తిప్పుకుంటూ వారి చేత ఖర్చులు చేయిస్తారు. చివరికి బంగారం మాత్రం తాకట్టు లోనే ఉంటుంది. చివరగా తాకట్టు పెట్టిన వారి సమాచారం సేకరించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తారు.

ఇందులో ఆధార్, పాన్, తాకట్టుకు సంబంధించిన రసీదులను తీసుకొని మరోచోట లోన్ పొందుతారు.

ఇలాంటి మోసాలు ఎక్కువగా గ్రామీణ, పట్టణాల్లో కనిపిస్తాయి. అప్పుల బాధతో ఉన్నవారు వాటి నుంచి త్వరగా బయటపడేందుకు బాధితులు చెప్పే ప్రతి మాట వింటూ ఉంటారు. అందువల్ల ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

# విజయం వెనుక రహస్యం...

కరీంనగర్, ఫిబ్రవరి 26, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విజయ పరంపర వెనుక ఒక బలమైన దైవ రహస్యం ఉంది. కరీంనగర్ కంచుకోటలో మహాశక్తి కొలువు తీర్చినా, భాగ్యనగర నడిబొడ్డున భాగ్యలక్ష్మి అమ్మవారి చెంత మోకరిల్లినా.. ఆయన వేసే ప్రతి అడుగు ఒక గెలుపు పిలుపుగా మారుతోంది. కార్పొరేటర్ స్థాయి నుండి నేడు కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయి వరకు ఎదిగిన సంజయ్ ప్రస్థానంలో, 'భాగ్యలక్ష్మి అమ్మవారే' తన విజయలక్ష్మి అని ఆయన ప్రగాఢ నమ్మకం. వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ 'హిందూ హృదయ సామ్రాట్' సెంటిమెంట్ వెనుక ఉన్న ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రయాణంపై ప్రత్యేక కథనం..బండి సంజయ్ రాజకీయ ప్రయాణం కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర మంత్రి వరకు ఎదిగింది అంటే, దానికి ఆయన పోరాట పటిమతో పాటు అమ్మవారిపై ఆయనకున్న అచంచలమైన విశ్వాసం కూడా ఒక కారణం.కార్పొరేటర్‌గా ఉన్న కాలంలోనే కరీంనగర్‌లో మహాశక్తి ఆలయ నిర్మాణానికి సంకల్పించడం ఆయన ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. ఎంపీగా బాధ్యతలు చేపట్టాక ఆ సంకల్పాన్ని పూర్తి చేసి, ప్రతి ఏటా శక్తి మాల ధరించి అమ్మవారి సేవలో తరించడం ఆయనకు ఒక ఆనవాయితీగా మారింది.హైదరాబాద్‌లోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారు బండి సంజయ్ పాలిట విజయలక్ష్మిగా నిలిచారు.ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు అమ్మవారిని దర్శించుకోవడం. కీలకమైన రాజకీయ నిర్ణయాలు లేదా పోరాటాల సమయంలో ఉదాహరణకు జీహెచ్ఎంసీ ఎన్నికలు, ప్రజా సంగ్రామ యాత్ర భాగ్యలక్ష్మి ఆలయం నుండే అడుగులు వేశాడు. వరుస విజయాలు రెండు సార్లు ఎంపీగా, జీహెచ్ఎంసీలో పార్టీ బలోపేతం ఈ నమ్మకాన్ని మరింత బలపరిచాయి.తెలంగాణలో బీజేపీ అధికారం చేపడితే భాగ్యలక్ష్మి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా తీర్చిదిద్దుతామన్న ఆయన ప్రకటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఈ ఆలయ అభివృద్ధిని ఆయన ఒక ప్రతిష్టాత్మక అంశంగా భావిస్తున్నారు.ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయం ఆయన నాయకత్వానికి మరో నిదర్శనం. గెలుపు అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ మరియు కౌన్సిలర్లతో కలిసి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా, తన విజయాలన్నీ అమ్మవారికే అంకితమని ఆయన మరోసారి చాటిచెప్పారు.రాజకీయాల్లో వ్యూహాలు ఎంత ముఖ్యమో, దైవబలం కూడా అంతే అవసరమని నమ్మే నాయకుల్లో బండి సంజయ్ ముందు వరుసలో ఉంటారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.

## క్షేత్రస్థాయిపై దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 26, తెలంగాణ రాజకీయాల్లో పదిహేనేళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన భారత్ రాష్ట్ర సమితి ఇప్పుడు తిరిగి పూర్వ వైభవం కోసం నిశ్శబ్దంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న అధినేత కేసీఆర్, ఇప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలను అమలు చేయనున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టడంపై కేసీఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగిస్తూనే, ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు.రాజకీయాలు వేగంగా మారుతున్నా కేసీఆర్ ఏమాత్రం తొందరపడకుండా వ్యవహరిస్తున్నారు. వెళ్లే వారిని అడ్డుకోకుండా, మిగిలి ఉన్న నిబద్ధత గల నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పదవుల కోసం పార్టీ మారే వారితో పోలిస్తే, సిద్ధాంతం కోసం నిలబడే వారే పార్టీకి అసలైన బలమని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తున్నారు. దీనికోసం ప్రతి మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి కొత్త రక్తాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు.గతంలో తెలంగాణ సెంటిమెంట్ మీద ఎక్కువగా ఆధారపడిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రజా సమస్యల మీద గొంతు ఎత్తుతోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను అస్త్రాలుగా మార్చుకుంటోంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడటం ద్వారా కోల్పోయిన ప్రజాధారణను మళ్ళీ పొందవచ్చని కేసీఆర్ గట్టిగా విశ్వసిస్తున్నారు. శాసనసభలో కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా వ్యూహకర్తలతో కలిసి నిరంతర చర్చలు జరుపుతున్నారు. ఓ వైపు తెలంగాణ సెంటిమెంట్ తో పాటు ప్రజా సమస్యలను కూడా ఎక్కువగా తెరపైకి తెచ్చి పోరాడాలని భావిస్తున్నారు.బయటకు పెద్దగా కనిపించకపోయినా, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ చదరంగం నడుపుతున్నారు. ఎప్పుడు ఏ అడుగు వేయాలో తెలిసిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైనప్పుడు దాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒకప్పుడు ఉద్యమ నేతగా పార్టీని ఎలా నిర్మించారో, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పునర్నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.సరైన సమయం చూసి బీఆర్ఎస్ పార్టీ మొత్తాన్ని ఒక్క సారి రీయాక్టివేట్ చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. గోదావరి జలాల పేరుతో బహిరంగసభలతో దీన్నిప్రారంభించాలనుకున్నా.. మున్సిపల్ ఎన్నికల కారణంగా వాయిదా వేశారు.

# విస్తరణ తలనొప్పికి దూరమే..

హైదరాబాద్, ఫిబ్రవరి 26, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ అధిష్టానం వద్ద ఆయన పరపతి గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. వరుస విజయాలు తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి మాటకు తిరుగులేని పరిస్థితి కనిపిస్తోంది.మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు పని చేయని వారిని తీసేసి కొత్త వారితో భర్తీ చేయాలన్న చర్చ కొంత కాలంగా జరుగుతోంది. అయితే ఇప్పుడున్న మంత్రులను కదిలించడం , కొత్తవారిని తీసుకోవడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న టీమ్ తోనే సమన్వయం చేసుకుంటూ వెళ్లడం మేలని ఆయన ఆలోచనగా తెలుస్తోంది. అనవసరంగా కేబినెట్ ప్రక్షాళన చేసి అసంతృప్తికి తావివ్వడం కంటే పాలనపై దృష్టి పెట్టడమే ఉత్తమమని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు సమాచారం. కానీ ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. ఆశావహులు పలువురు తమ ప్రయత్నాలను ఢిల్లీ స్థాయి నుంచి చేసుకుంటున్నారు. మంత్రివర్గ విస్తరణ చేపడితే సామాజిక వర్గాల వారీగా సమతుల్యత పాటించడం రేవంత్ రెడ్డికి పెద్ద సవాలుగా మారనుంది. రెడ్డి సామాజిక వర్గంతో పాటు బీసీ, ఎస్సీ , మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆశావహుల జాబితా చాంతడంత ఉండటంతో ఎవరిని తీసుకున్నా మిగిలిన వారిలో అసహనం కలిగే అవకాశం ఉంది. ఈ కారణాల వల్ల రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై హైకమాండ్ నుండి రేవంత్ రెడ్డికి పూర్తి స్వేచ్ఛ లభించినట్లు సమాచారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి అనే నిర్ణయాధికారం ఆయనకే వదిలేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ రేవంత్ రెడ్డి తక్షణమే ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని ..కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.బడ్జెట్ సమావేశాలు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు వంటి కీలక రాజకీయ పరిణామాల తర్వాతే దీనిపై ఒక నిర్ణయం ఉండవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అప్పటి వరకు ప్రస్తుత మంత్రుల పనితీరును గమనించి ఆ తర్వాతే మార్పులు చేసే అవకాశం ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి తన పట్టును మరింత పెంచుకోవడం పైనే దృష్టి సారించారు. ఆశావహుల్ని ఎలా ఎదురు చూస్తూ ఉండేలా చేయనున్నారు.

# రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవమా...

హైదరాబాద్, ఫిబ్రవరి 26, తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం జరగబోయే ఈ ఎన్నికలు ఏకగ్రీవం అవుతాయా లేక పోటీ తప్పదా అన్న ఉత్కంఠను రేపుతున్నాయి. అసెంబ్లీలో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి చూస్తే, అధికార కాంగ్రెస్ పార్టీకి ఒక స్థానాన్ని సునాయాసంగా గెలుచుకునే సంఖ్యాబలం ఉంది. అయితే, రెండో స్థానాన్ని దక్కించుకోవాలంటే మాత్రం సమీకరణాలు కీలకంగా మారాయి. ఇక్కడే రాజకీయ చదరంగం మొదలవుతోంది.

కాంగ్రెస్ పార్టీ ఒక స్థానానికి ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఆయనకు తక్కువ కాలమే అవకాశం రావడంతో, ఈసారి ఆయనకే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం.అయితే, రెండో స్థానం విషయంలో మాత్రం పార్టీలో ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పేరు ఈ రేసులో బలంగా వినిపిస్తోంది. గత రెండేళ్లుగా అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కీలక పాత్ర పోషిస్తూ.. పలు ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు.వీరితో పాటు వి.హనుమంతరావు, మధుయాష్కీ గౌడ్, టి.జీవన్ రెడ్డి, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, జానారెడ్డి వంటి సీనియర్లు కూడా ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు.మరోవైపు, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఎటువంటి వ్యూహాన్ని అనుసరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ, ఒక మైనార్టీ అభ్యర్థిని బరిలోకి దించడం ద్వారా కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే ఎంఐఎం మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఎంఐఎం మద్దతు గనుక కాంగ్రెస్‌కు లభిస్తే రెండో సీటును కూడా వారు సులువుగా గెలుచుకోవచ్చు. అయితే, బీఆర్ఎస్ మైనార్టీ కార్డును ప్రయోగిస్తే మాత్రం కాంగ్రెస్ తన అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగు వేయాల్సి ఉంటుంది. సామాజిక సమీకరణాలు దెబ్బతినకుండా చూసుకోవడం అధికార పార్టీకి పెద్ద సవాలుగా మారనుంది.బీజేపీకి ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం లేదు. వారు తటస్థంగా ఉంటే అది పరోక్షంగా ఎవరికి లాభిస్తుందనే లెక్కలు కూడా మొదలయ్యాయి.

ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 5వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఈ తక్కువ సమయంలో రాజకీయ పార్టీల మధ్య జరిగే అంతర్గత చర్చలు, పొత్తులు ఈ ఎన్నికల తుది ఫలితాన్ని నిర్ణయించనున్నాయి. ఒకవేళ బీఆర్ఎస్ వెనక్కి తగ్గితే ఎన్నికలు ఏకగ్రీవం కావచ్చు, లేనిపక్షంలో తెలంగాణలో మరో రాజకీయ రణరంగాన్ని చూడాల్సి వస్తుంది. మొత్తానికి ఈ రాజ్యసభఎన్నికలు రాబోయే రాజకీయ పరిణామాలకుఒకకీలకమలుపుగా మారనున్నాయి.

# ఉద్యమ లక్ష్యాలనే నమ్ముకున్న గులాబీదళం.

హైదరాబాద్, ఫిబ్రవరి 26, తెలంగాణ ఏర్పాటు తర్వాత రాజకీయ పార్టీగా మారామని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఉద్యమపార్టీగానే వ్యవహరిస్తోంది. లక్ష్యం నెరవేరిన తర్వాత కూడా..తెలంగాణ సెంటిమెంట్తోనే రాజకీయాలు ఈదాలనుకుంటున్నారు. అక్కడే అసలైనతప్పిదం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన టీఆర్ఎస్, లక్ష్యం నెరవేరిన తర్వాత రాజకీయ పార్టీగా అవతరించింది. అయితే, కేసీఆర్ ప్రకటించినట్లుగా అది పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా రూపాంతరం చెందిందా అంటే సందేహమే. పదేళ్ల అధికారం, రెండేళ్ల ప్రతిపక్షంగా బాధ్యతల తరవాత కూడా ఇప్పటికీ అదే తెలంగాణ సెంటిమెంట్ ను నమ్ముకుని రాజకీయం చేయడం ఆ పార్టీ చేస్తున్న అతిపెద్ద పొరపాటుగా మారుతోంది. ఉద్యమ కాలం నాటి వ్యూహాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పని చేయడంలేదు.ఒక రాజకీయ పార్టీగా ప్రజల్లో గుర్తింపు పొందాలంటే ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాడాలి. ప్రజల సమస్యలను భుజాన వేసుకోవాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం ఇంకా ఉద్యమ కాలం నాటి భావోద్వేగాలనే పెట్టుబడిగా పెడుతోంది. తెలంగాణ ఏర్పాటు అనే ప్రధాన లక్ష్యం నెరవేరిన తర్వాత, ప్రజలు అభివృద్ధిని, సుపరిపాలనను కోరుకుంటారు తప్ప మళ్ళీ పాత సెంటిమెంట్లను కాదు. ఈ మార్పును గమనించడంలో ఆ పార్టీ నాయకత్వం వెనుకబడిందనే చర్చ సాగుతోంది.ఉద్యమ పార్టీగా ఉన్నప్పుడు ప్రజల్లో ఉండే ఆవేశం, రాజకీయ పార్టీగా మారినప్పుడు ఉండదు. కేవలం సెంటిమెంట్ చూపిస్తూ ఓట్లు అడగాలనుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా అదే పాత పాట పాడటం వల్ల ప్రజల్లో ఆ పార్టీ పట్ల ఉన్న ఆసక్తి తగ్గుతోంది. మా అవసరం ఉంది అని ప్రజలకు నమ్మకం కలిగించాలంటే, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడి పోరాడాలి. కానీ బీఆర్ఎస్ ఇంకా పాత జ్ఞాపకాల నుంచే రాజకీయం చేయాలనుకుంటోంది.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రాజకీయ పార్టీగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పదే పదే ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తెస్తోంది. ప్రజలు ఒక ప్రత్యామ్నాయ శక్తిగా గుర్తించాలంటే, ఆ పార్టీ తన పంథాను మార్చుకోవాలి. ఉద్యమ ముసుగును పక్కన పెట్టి, పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా జనం మధ్యకు వెళ్లాలి. సమస్యల పరిష్కారం కోసం గొంతు ఎత్తాలి తప్ప, గతాన్ని గుర్తు చేస్తూ కాలం గడపకూడదు.బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులకు ఏమాత్రం సరిపోవడం లేదు. సెంటిమెంట్ అనేది ఒక పరిమితి వరకే పనిచేస్తుంది. ఆ గీత దాటిన తర్వాత ప్రజలు వాస్తవాలను చూస్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వెనుకబడి, కేవలం భావోద్వేగాలను నమ్ముకోవడం వల్ల పార్టీ కేడర్ కూడా గందరగోళానికి గురవుతోంది. రాజకీయ పార్టీగా తన బాధ్యతలను విస్మరించి, ఇంకా ఉద్యమ పార్టీగానే ఉండిపోవాలనుకోవడం ఆత్మహత్యాసదృశ్యమే అవుతుందన్న భావన ఎక్కువగా వినిపిస్తోంది.

## భారీ విస్తరణ దిశగా ఓయో

హైదరాబాద్, ఫిబ్రవరి 26, ఓయో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తన వ్యాపార విస్తరణను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం 300 కంపెనీ సర్వీస్డ్ హోటళ్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాలను ప్రధాన లక్ష్యంగా ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన హోటల్ భాగస్వాముల సదస్సులో ఈ కీలక ప్రకటన వెలువడింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాలు, టియర్-2 నగరాల్లో తమ బలమైన ఉనికిని ఏర్పరచుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా సంస్థ వెల్లడించింది.హైదరాబాద్‌లో అభివృద్ధి చెందుతున్న మెడికల్, బిజినెస్ టూరిజం రంగాల వల్ల ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. అదే సమయంలో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలైన యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంతాలకు వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సంస్థ తన విస్తరణ వ్యూహాన్ని రూపొందించింది. ఇక ఏపీలో వైజాగ్ సహా విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో ప్రీమియం హోటల్స్ సంఖ్యను పెంచేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.సరఫరా పెంపు, హోటళ్ల నాణ్యత ప్రమాణాల మెరుగుదల, అతిథులకు మెరుగైన సేవల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన అభివృద్ధి ప్రణాళికను సంస్థ ప్రకటించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు, మెరుగైన విమాన సౌకర్యాలు వంటి కారణాల వల్ల తెలంగాణ దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న హాస్పిటాలిటీ మార్కెట్‌గా మారుతోంది.ఈ సందర్భంగా ౹ాజూ మాతృసంస్థగా పేర్కొన్న సంస్థ) రీజినల్ హెడ్ (సౌత్ సెంట్రల్,ఈస్ట్) అయిన ఆశిష్ సౌరభ్ మాట్లాడుతూ, తెలంగాణ హాస్పిటాలిటీ రంగం నిర్మాణాత్మకంగా బలంగా ఉందన్నారు. హైదరాబాద్ వంటి వ్యాపార కేంద్రాలు స్థిరమైన కార్పొరేట్ డిమాండ్‌ను అందిస్తుండగా, మెరుగైన కనెక్టివిటీ కొత్త లీజర్ టూరిజం అవకాశాలను తెరుస్తోందని తెలిపారు. అతిథులకు మరింత విశ్వసనీయమైన సేవలను అందించే బలమైన నెట్‌వర్క్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు.ఈ సమగ్ర వ్యూహం భాగస్వాములకు దీర్ఘకాలిక లాభాలను అందించడమే కాకుండా, ప్రయాణికులకు స్థిరమైన నాణ్యతతో కూడిన సేవలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ పర్యాటకం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలో హోటల్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

# ఇద్దరు చైన్ స్నాచర్లను పట్టుకున్న గ్రామస్థులు

ముమ్మిడివరం ఐ.పోలవరం మండలం మురమళ్ల నుండి పశువుల్లంక బైక్ పై వెళుతున్న దంపతులను వెంబడించి మహిళ మెడలోని బంగారు గొలుసును ఇద్దరు ఆగంతకులు లాక్కెళ్లారు. స్థానిక గ్రామస్తులు వారిని వెంబడించి సలాదివారిపాలెం లంకలో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధిత మహిళ రాజ్యలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అయ్యప్ప ఆలయంలో నమాజు బీజేవైఎం అందోళన

మేడ్చల్ జిల్లా మేడిపల్లి పిఎస్ పరిధి ప్రతాపసింగారంలోని అయ్యప్పస్వామి దేవాలయంపై ఓ వ్యక్తి నమాజ్ చదువుతున్నాడని చూసిన స్థానికులు, బీజేవైఎం నాయకులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.సంఘటన స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని మేడిపల్లి పోలీసు స్టేషన్ కి తీసుకొచ్చారు.. ఆ వ్యక్తి నమాజ్ చేస్తున్నప్పుడు చూసిన బీజేవైఎం నేతలు మేడిపల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. పిర్యాదు పై మేడిపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రతాపసింగారంలో ఆలయం వద్ద బీజేపీ, బీజేవైఎం నాయకుల రాకతో కొంత హడావిడి నెలకొంది. మేడిపల్లి పిఎస్ కి బీజేపీ, బీజేవైఎం చేరుకున్నారు. ఆ వ్యక్తి పేరు జుబేర్ అంటున్నట్లు తెలుస్తుంది. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## డయోరియా బాధితులను పరామర్శించిన మంత్రి నారాయణ

శ్రీకాకుళం డయేరియా బాధితులను మంత్రి నారాయణ పరామర్శించారు. డయేరియా తో మృతి చెందిన మండల సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. తమ పిల్లలకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని సురేష్ కుటుంబసభ్యులు కోరారు. తరువాత మంత్రి డయేరియా ప్రబలిన ప్రాంతాలను పరిశీలించారు. ప్రభుత్వ వైద్య కళాశాల, కిమ్స్ లో బాధితుల ను పరామర్శించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ డయేరియా పై జిల్లా యంత్రంగం వెంటనే అప్రమత్తమయింది. 102 కేసులు నాలుగు సచివాలయాల పరిధిలో నమోదయ్యాయి . 13 మంది డిశ్చార్జ్ అయ్యారు. 85 మంది ఆస్పత్రిలో ఉన్నారు. ఇద్దరు కిడ్నీ సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 45 మందిని ఇప్పుడు వెంటనే డిచ్చార్జ్ చేయవచ్చు కానీ అబ్జర్వేషన్ కోసం ఆసుపత్రి లోనే ఉంచాం. 50 టీం లతో డోర్ టు డోర్ సర్వే చేసాం. ఒకరు డయేరియా డెత్ గా గుర్తించామని అన్నారు.

# మంగళగౌరి షోరూమ్ లో అగ్ని ప్రమాదం




హైదరాబాద్ హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంగళగౌరి షోరూమ్లో మంటలు చెలరేగాయి. . మంటలు భారీగా ఎగిసిపడుతున్న పడుతుండటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలపు అదుపులోకి తెచ్చారు. ముందుగా మంటలు షోరూమ్ బయట సెట్కి అంటుకున్నట్లు సమాచరం. . మంటలు భారీగా చెలరేగడంతో పక్కనున్న షాపులకు కూడా అంటుకున్నాయి., వెల్డింగ్ పనులు చేస్తుండగా, మంటలు అంటుకున్నట్లు సమాచారం. మంటలు ఇతర షాపులకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని మాల్ యజమాన్యం చెబుతుంది.

# ఇంటర్ పరీక్షల కేంద్రాల బందోబస్తు పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి



మహబూబ్నగర్ జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా గురువారం రెండవ సంవత్సరం (సెకండ్ ఇయర్) పరీక్ష నిర్వహణ జరుగుతున్న నేపథ్యంలో, మహబూబ్నగర్ టౌన్లోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి సందర్శించారు.

జిల్లా ఎస్పీ పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

పరీక్ష కేంద్ర పరిసర ప్రాంతాలలో 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయడం, అనధికార వ్యక్తులు గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకోవడం, మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంపై కఠిన నిబంధనలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకునేలా సహకరించాలని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని, అపోహలు లేదా రూమర్లు నమ్మవద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజంపేట లాడ్జిలో అగ్ని ప్రమాదం ఒకరు సజీవ దహనం

కడప రాజంపేట పట్టణం రైల్వే స్టేషన్ రోడ్ లోని దీప్ లాడ్జిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షాక్ సర్క్యూట్ తో రాత్రి ఒంటి గంట కు మంటలు వ్యాపించాయి. లాడ్జిలో ఉన్న 39 మంది భయాందోళనలతో పరుగులు తీసారు. దట్టంగా అలుముకున్న పొగకు మొదటి ఫ్లోర్ నుంచి కిటికీల ద్వారా పలువురు కిందకు దూకారు. రాక పోకలకు ఒకే దారి ఉండడంతో తొక్కిస లాట జరిగింది. అగ్నిమాపక సిబ్బంది బాధితులను నిచ్చినల ద్వారా కిందకి దింపారు. ఒక వ్యక్తి మంటలకు సజీవదహనం అయ్యాడు. మృతుడు శ్రీనివాసులు (35) రాజంపేట సూపర్ కే మార్ట్ ఉద్యోగిగా గుర్తించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ పి మనోజ్ కుమార్ హెగ్డే, ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆస్వస్థతకు గురైన వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# నలుగురు చనిపోతే ఇక్కరే అని చెబుతున్నారు మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో డయేరియా బాధితులను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి, పార్టీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సీదిరి అప్పలరాజు తదితరులు పరామర్శించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాలైన దమ్మలవీధి, కంద్రవీధి, గుడివీధి ప్రాంతాల్ని పరిశీలించారు. మృతుల కు టుంబ సభ్యులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారు. మాజీ నలుగురు చనిపోతే ఒక్కరే చనిపోయారని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాతూ.. డయేరియా తో సుమారు నలుగురు చనిపోతే తమకు సంబంధం లేదంటూ కూటమి ప్రభుత్వం తప్పించుకుంటుందని అన్నారు. ఒక్క మృతినే డయేరియా కేసుగా గుర్తించి ఆ మృతుని కుటుంబానికి 10 లక్షలు ఆర్థిక సహాయం చేసి చేతులు దులుపు కుందని విమర్శించారు. డయేరియాతో ఒకే ప్రాంతంలో నలుగురు చనిపోవడం సిగ్గుచేటని డయేరియా ప్రమాదానికి కారణమైన హెల్త్ సిబ్బంది డాక్టర్స్ పై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.

# ముగ్గురు మంత్రులున్నా... మెడికిల్ మాఫియా..

ఖమ్మం, ఫిబ్రవరి 26, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీలు, హోటళ్లు, సినిమాలు, ప్రైవేటు కంపెనీలు, దుకాణాలు, ఇతర ఫ్యాక్టరీలు, ఇలా ఎన్నో ఉన్నాయి. ఇందులో ఎంతలేదన్నా.. కనీసం 2.5 లక్షల మంది వరకు చిరు ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తూంటారు. వీరందరూ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) కిందకే వస్తారు. ఉద్యోగులు, కార్మికుల కుటుం బసభ్యులతో కలిపితే సుమారు 10 లక్షల మందికి వైద్య సేవలు అందించాల్సిన ఈఎస్ఐ ఎందుకనో ఈ జిల్లాలో సరైన సేవలు అందించలేకపోతుంది. కేవలం ఒక్కటంటే ఒక్కటే డిస్పెన్సరీ (భద్రాచలం దగ్గర సారపాక)తో జిల్లా మొత్తానికి సేవలు అందుతున్నాయా అంటే పెదవి విరుపే సమాధానంగా కనపడుతోంది. పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారయ్యింది ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిస్థితి. డిప్యూటీ సీఎంతోపాటు మొత్తం ముగ్గురు ముఖ్యమైన మంత్రులు ఉన్నప్పటికీ.. ఈఎస్ఐ సేవలు అందించడంలో మాత్రం అన్ని జిల్లాల కంటే వెనుకబడే ఉంటోంది. సుమారు 10 లక్షల మంది చిరుద్యోగు లకు, కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు సేవలు అం దించాల్సిన ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటు విషయంలో ముగ్గురు మంత్రులు ఏ మాత్రం దృష్టి సారించనట్టుగా కనపడటం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. ఇక్కడ ఉన్న కార్మిక, చిరుద్యోగులు భారీగా ఉండటాన్ని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం (కార్మిక శాఖ) అదనంగా ఈఎస్ఐ డిస్పెన్సరీలను మంజూరు చేసినా.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయడం లేదు. దీనితో చాలాకాలం వేచిచూసి.. మంజూరు చేసిన డిస్పెన్సరీలను సైతం కేంద్రం రద్దు చేసింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం ఉన్న ముగ్గురు మంత్రులపై కార్మికులు, చిరుద్యోగులు భగ్గుమంటున్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న కార్మిక లోకాన్ని, చిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం సుమారు దశాబ్దం క్రితం (2018కి ముందు) మూడు ఈఎస్ఐ డిస్పెన్సరీలను మంజూరు చేసింది. అయితే అప్పటి ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఆ మూడింటినీ కేంద్రం రద్దు చేసింది. 2018లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15 డిస్పెన్సరీల ఏర్పాటులో భాగంగా.. ముదిగొండలోనూ ఈఎస్ఐ డిస్పెన్సరీని కేంద్రం మంజూరు చేసింది. అయితే షరా మామూలుగా.. ఈ 15 డిస్పెన్సరీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్థల సేకరణ, భవన నిర్మాణం, సిబ్బందిని నియామకం లాంటివి చేయకపోవడంతో.. ఈ డిస్పెన్సరీల ఏర్పాటు అటకెక్కింది. దీనిపై అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు పంపించిన కేంద్రం.. ఈ ఏడాది జనవరిలో సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చింది. 15 రోజుల్లో డిస్పెన్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలంటూ అల్టిమేటం ఇచ్చింది. అయినా.. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదు. దీనితో 2018లో మంజూరుచేసిన 15 డిస్పెన్సరీలను రద్దుచేస్తూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 డిస్పెన్సరీలను రద్దయ్యాయి. వాటిటో.. ఖమ్మం జిల్లాలోని ముదిగొండలోని డిస్పెన్సరీకూడా ఉండటంతో ఖమ్మంలోని కార్మికవర్గాలు మండిపడుతున్నాయి. హైదరాబాద్ నగరం తరువాత అత్యధిక మంది కార్మికులు, చిరుద్యోగులు ఉన్న పట్టణాల్లో ఖమ్మం కూడా ఉంది. ఈ నేపథ్యంలో గతంలోనే మూడు మంజూరైనా అప్పటి ప్రభుత్వాలు ఏర్పాటు చేయకపోవడం.. తాజాగా ముదిగొండలోనూ ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుపై జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకే ఆసక్తి లేకపోవడాన్ని ఇక్కడ కార్మిక వర్గాలు ఎత్తిచూపుతున్నాయి. స్థల సేకరణ, భవన నిర్మాణం, ఉద్యోగులను కేటయిస్తే.. వేలాదిమంది కార్మికులు.. వారి కుటుంబ సభ్యులతో కలుపుకుంటే.. లక్షలాది మందికి విస్తృతమైన సేవలు అందించే సదుపాయాన్ని మంత్రులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎప్పుడో సారపాకలో ఏర్పాటుచేసిన ఒక డిస్పెన్సరీ ఉంది. అలాగే గతంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు బ్రాంచ్ ఆఫీసుగా పిలుచుకునే లోకల్ ఆఫీసు (ఖమ్మంలోని రాపర్తినగర్) మాత్రమే ఈఎస్ఐ పరిధిలో ఉన్నాయి. ఇందులోనూ డిస్పెన్సరీలో మాత్రమే వైద్యులు, సిబ్బంది, మందులు ఉంటాయి. ఇక లోకల్ ఆఫీసు (బ్రాంచ్ ఆఫీసు)లో ఎలాంటి వైద్య సేవలు అందవు.. మందులు అందుబాటులో ఉండవు. కొండొకచో.. వైద్యుడు వచ్చి చూసి వెళుతుంటారు. అంతకుమించి అక్కడ అందే వైద్య సేవలు ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఈ నేపథ్యంలోనే ఖమ్మం లాంటి చోట భారీగా ఉన్న కార్మికులు, చిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం డిస్పెన్సరీలను మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం వైఖరితో అవికూడా రద్దు కావడంతో.. జిల్లా నాయకత్వంపై సర్వత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. డిస్పెన్సరీ ఏర్పాటు అనేది చిన్న అంశంగా బయటకు కనపడుతుందని, ఒకవేళ డిస్పెన్సరీని ఏర్పాటుచేస్తే.. ఖమ్మం జిల్లాలోని వేలాది మంది కార్మికులు, చిరుద్యోగులు, వారి కుటుంబాలతో కలిపి సుమారు 10 లక్షల మంది వరకు ప్రైవేటు ఆసుపత్రులకు దూరం అవుతారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో ఒక్క పైసా లేకుండా చికిత్సలు అందిస్తారు. ఒకవేళ వ్యాధి తీవ్రతను బట్టి.. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ వైద్య కళాశాలకు, ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. దీనివల్ల ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగులు తగ్గిపోయి.. రూ. కోట్లు నష్టపోతామనే ఉద్దేశంతోనే మెడికల్ మాఫియా చాపకింద నీరులా ప్రభుత్వ పెద్దలను ప్రభావితం చేసి డిస్పెన్సరీని ఏర్పాటు చేయకుండా అడ్డుకుందని గట్టిగా అనుమానిస్తున్నారు. అయితే కార్మికులు, చిరుద్యోగుల దృష్టిలో.. ప్రస్తుతం ఏచిన్న వైద్య సేవలు అందాలన్నా.. ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి రూ. వేలల్లో ఖర్చువుతోంది. అదే ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటుచేస్తే.. పూర్తి ఉచితంగానే వైద్యసేవలు, మందులు, డ్రగ్స్ అందుతాయని వారంటున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల ద్వారా ఉచితంగా వచ్చే వైద్యసేవలు అందకుండా అడ్డుకున్న మెడికల్ మాఫియాపై, అచేతనంగా ఉన్న ముగ్గురు మంత్రులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కార్మికులు, చిరుద్యోగులు భారీ సంఖ్యలో ఉండటంతో.. ఖమ్మం పట్టణంలో ప్రతి గ ల్లీకి ఒక ప్రైవేటు ఆసుపత్రి కనిపిస్తుంది. అలాగే జిల్లా వ్యాప్తంగాకూడా భారీగా ప్రైవేటు ఆసుపత్రులు ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతూ కనపడుతుంటాయి. వాస్తవానికి ఇక్కడికి వచ్చేవారిలో 50 శాతం కంటే ఎక్కువ మంది రోగులు కార్మికులు, చిరుద్యోగులు, చిరువ్యాపారులు, వారి కుటుంబ సభ్యులే ఉంటారు. అంటే వీరందరూ ఈఎస్ఐ పరిధిలోకి వస్తారన్నమాట. తాజాగా ముదిగొండలో మంజూరుచేసిన డిస్పెన్సరీని కూడా రద్దు చేయడంతో.. ఈ ప్రభావం కార్మికులపైనే ఎక్కువగా పడుతుందని వారంటున్నారు. అయితే మంజూరైన డిస్పెన్సరీలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేయలేకపోతుందనే అనుమానాలు వీరిని తొలుస్తున్నాయి. పరిస్థితి చూస్తే.. ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు అయితే.. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గి.. ప్రైవేటు ఆసుపత్రుల వ్యాపారం దెబ్బతింటుందని, ఈ నేపథ్యంలోనే మెడికల్ మాఫియా ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చి.. డిస్పెన్సరీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపించి ఉంటుందని కార్మిక వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అందుకే ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ.. మంజూరైన డిస్పెన్సరీ ఏర్పాటుపై దృష్టి పెట్టలేదంటూ వాపోతున్నారు.

## 45 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు?

## కీలక శాఖలు, జిల్లాల్లో మార్పులు

రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టి మొత్తం 45 మందిని మార్చింది. ఐటీ, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంజయ్ కుమార్‌ను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. జీవో ఆర్‌టి నెం. 290 ప్రకారం మొత్తం 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం పరిశ్రమలు, ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంజయ్ కుమార్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఆర్‌ఎస్‌ఏడీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో ఎన్. శ్రీధర్‌ను ఐటి, పరిశ్రమల శాఖల ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో పాటు గనులు, భూగర్భ శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాను ఐ అండ్ సి ఏ డి శాఖ నుంచి సాధారణ పరిపాలన శాఖ రాజకీయ విభాగ ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసి, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఈ. శ్రీధర్‌ను సాగునీటి మరియు కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ కార్యదర్శిగా నియమించారు. డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌ను తెలంగాణ భవన్ సమన్వయ విభాగం నుంచి ఆర్థిక మరియు ప్రణాళిక శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ బి. విజయేంద్రను సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సమాఖ్య కార్యదర్శిగా, షెడ్యూల్డ్ కాస్ట్ అభివృద్ధి కమిషనర్‌గా నియమించారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్‌పతిను కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్‌గా బదిలీ చేయగా, ఆమె స్థానంలో చిత్ర మిశ్రాను కరీంనగర్ కలెక్టర్‌గా నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేసి, నిజామాబాద్ అదనపు కలెక్టర్ అంకిత్‌ను భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా నియమించారు. మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా ఖుష్బూ గుప్తా, వికారాబాద్ కలెక్టర్‌గా దీపక్ తివారీ, మెదక్ కలెక్టర్‌గా ప్రతిమా సింగ్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా గరీమా అగ్రవాల్ నియమితులయ్యారు. జంగావ్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, నారాయణపేట, హనుమకొండ, జోగులాంబ గద్వాల జిల్లాలకు కూడా కొత్త కలెక్టర్లను నియమించారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ పదవుల్లో కూడా మార్పులు చేసి కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్ జోన్లకు కొత్త అధికారులను నియమించారు. ఇలా పరిపాలన అవసరాల దృష్ట్యా శాఖల మార్పులు, జిల్లాల కలెక్టర్ల బదిలీలు, అదనపు బాధ్యతల కేటాయింపులతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో పరిపాలన పునర్వ్యవస్థీకరణ చేపట్టింది.

## సత్య సాయి బాబా డ్రీమ్ ప్రాజెక్టైన వాటర్ ప్రాజెక్టును యధావిధిగా కొనసాగించండి.

**జిల్లా పరిషత్ నుంచి తొలగించి సత్యసాయి ప్రాజెక్ట్ లోనే కొనసాగించండి.**

**ఆ ప్రాజెక్టు కింద పని చేసే 596 మంది కార్మికులకు న్యాయం చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.**



సత్యసాయి గ్రామీణ త్రాగునీటి పథకంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి. పుట్టపర్తి :26రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా త్రాగునీరు కల్పించాలని త్రాగునీటి కొరత తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఆనాడు సత్యసాయి సప్లై వాటర్ ప్రాజెక్టును బాబా గారు తీసుకొచ్చారని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. విజయవాడ అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సత్యసాయి త్రాగునీటి పథకం లో ఎదురవుతున్న ఇబ్బందులను కార్మికుల సమస్యలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా గారు ప్రజలకు కలియుగ ప్రత్యక్ష దైవమన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమ ప్రాంతంలో నీటి దాహార్తిని తీర్చడానికి సత్యసాయి వాటర్ ప్రాజెక్టును ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికి 1997లో ఆనాడు ప్రారంభించారన్నారు. ఈ ప్రాజెక్టు కింద 273 వ్యక్తిగత ప్రాజెక్టులు 19 ఇతర స్కీములు మరో 5 మిగతా స్కీమ్ లు కొనసాగుతున్నాయి ఇందులో 1341 గ్రామాలకు 16.41 లక్షల మంది ప్రజలకు త్రాగునీరు అందిస్తోందన్నారు. అయితే ఈ సత్యసాయి ప్రాజెక్టును ఈ మధ్య జిల్లా పరిషత్ బోర్డు కు అప్పగించడం జరిగిందన్నారు. దీనివల్ల ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా జరిగే అవకాశం తక్కువగా ఉందని ప్రజల్లో ఆందోళన కలుగుతుందన్నారు. జిల్లా పరిషత్ కింద ఈ ప్రాజెక్టు ఉంటే నిర్వహించడం కూడా ఎంతో కష్టమన్నారు. మరి ముఖ్యంగా ఈ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు అనేది భగవాన్ శ్రీ సత్య సాయి బాబా డ్రీమ్ ప్రాజెక్టు అన్నారు. ప్రభుత్వం తక్షణం సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టును జిల్లా పరిషత్ నుంచి తొలగించి తిరిగి సత్యసాయి త్రాగినీటి పథకంగా కొనసాగించేలా చేసి అందులో పని చేస్తున్న 596 మంది కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు.

## పూర్తికాని వెలుగొండను.. జాతికి అంకితమంటూ జగన్ మోసగించారు

**గుండ్లకమ్మ గేట్లు విరగ్గొట్టి ఇసుక దోపిడీ చేశారు**

**ఐదేళ్లలో అన్ని వ్యవస్థల్నీ జగన్ రెడ్డి భ్రష్టు పట్టించాడు**

**కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం**

**-ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

మార్కాపురం: పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశామంటూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా ప్రజలను మోసగించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. పనులు పూర్తిచేయకుండా కేవలం ప్రచారానికే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. రైతుల ఆశలను వమ్ము చేస్తూ ప్రాజెక్టును రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ధ్వంసం చేసి, భారీ ఎత్తున ఇసుక దోపిడీ చేశారని అన్నారు. ప్రజా సంపదను కాపాడాల్సిన ప్రభుత్వం దానినే దోచుకుందన్నది దురదృష్టకరమన్నారు. ఇలా జగన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లాలో బుధవారం నాడు సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ... కూటమి ఏర్పడిన వెంటనే గుండ్లకమ్మకు కొత్త గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం 20 లక్షల చేప పిల్లలను గుండ్లకమ్మలో వదిలిన విషయాన్ని మంత్రి సభా ముఖంగా గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు బడ్జెట్ లో నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసినట్లు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. గడిచిన 19 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదలకు వెయ్యి కోట్లు రూపాయిలు సహాయం చేశామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి పేదల పెన్షన్ వెయ్యి రూపాయిలు పెంచడానికే ఐదేళ్లు పట్టిందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. కేవలం ఒక్క సంతకంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పెన్షన్ ను వెయ్యి రూపాయిలు పెంచారని చెప్పారు. ఆర్థిక అసమానతలు తొలగించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమాన్ని రూపొందించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

## ఏపీ లిక్కర్ స్కాం : లొంగిపోయిన ముప్పిడి అవినాష్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాంలో పరారీలో ఉన్న లిక్కర్ స్కామ్ నిందితుడు ముప్పిడి అవినాష్ రెడ్డి విజయవాడ సిట్ కార్యాలయంలో లొంగిపోయారు. విదేశాల నుంచి వచ్చిన ఆయనపై లుకౌట్ నోటీసులు ఉన్నాయి. ఆయనను ఎయిర్ పోర్టులో అరెస్టు చేసే అవకాశం ఉన్నప్పటికీ.. సిట్ ఆఫీసులో లొంగిపోయేందుకు తానే వస్తానని ముందస్తుగా సమాచారం ఇచ్చి మరీ ముప్పిడి అవినాష్ రెడ్డి లొంగిపోయారు. ఆయనకు అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో తప్పనిసరిగా సిట్ ఎదుట లొంగిపోవాల్సి వచ్చింది. లిక్కర్ స్కామ్ కేసులో ముప్పిడి అవినాష్ రెడ్డి ఏ-7 గా ఉన్నారు. ఈ కుంభకోణానికి సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి కి ఇతను అత్యంత సన్నిహితుడు . వ్యాపార భాగస్వామి కూడా అని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. మద్యం సరఫరాదారుల నుంచి కమిషన్ల రూపంలో వసూలు చేసిన కోట్లాది రూపాయల నిధులను షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు మళ్లించడంలో ఇతను కీలక పాత్ర పోషించారని ఆరోపణలు ఉన్నాయి. హవాలా మార్గాల ద్వారా ఈ నిధుల మళ్లింపు జరిగినట్లు విచారణలో తేలింది.

అవినాష్ రెడ్డిని విచారిస్తే ఈ స్కామ్‌లో ఉన్న మరికొంత మంది రాజకీయ ప్రముఖుల పేర్లు , నిధుల మళ్లింపుకు సంబంధించిన మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ప్రియుడు ఆత్మహత్య భయంతో ప్రియురాలి ఆత్మహత్య



బాసర ట్రిపుల్ ఐటీ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో కీలక అంశాలు బయటపడ్డాయి. యువతి పెళ్లికి నిరాకరించిందని ప్రియుడి ఆత్మహత్య, మనస్తాపంతో మరుసటి రోజు యువతి ఆత్మహత్య చేసుకుంది. వనపర్తి జిల్లా పానగల్ మండలం అన్నారంతండాకు చెందిన చిట్టెమ్మ, లోక్యనాయక్ దంపతుల రెండో కూతురు వసంత(19) అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వసంతను గత కొంతకాలంగా ప్రేమిస్తూ, పెళ్లి చేసుకోవాలని ఆమె మేనత్త కొడుకు గణేష్ నాయక్ కోరాడు. చదువు పూర్తయ్యేంత వరకు పెళ్లి చేసుకోనని వసంత చెప్పడంతో, ఉరివేసుకుని గణేష్ నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకుని భయంతో మెడపై గాట్లు పెట్టుకుని, ఉరివేసుకుని వసంత ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు వెల్లడించారు. వసంత చివరి ఫోన్ కాల్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

# పేదలకు విద్య అందాలంటే ఊరి బడి ఉండాల్సిందే !

-ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే యుటిఎఫ్ లక్ష్యం

.-యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్






బద్వేలు పేదలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందాలంటే ఊరి బడి ఉండాల్సిందేనని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. కడప నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి అధ్యక్షతన జరిగిన "ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం"అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోన్ముఖాభివృద్ధికి పాటుపడుతూ, విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు నేడు పాలకుల విధానాల ఫలితంగా ప్రమాదపుటంచుల్లోకి నెట్టి వేయబడ్డాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే లక్ష్యంగా హామీలిస్తున్న పాలకవర్గాలు తీరా గద్దినెక్కాక హామీలను విస్మరిస్తూ ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం 117 జీవోను ప్రవేశపెట్టి, పాఠశాలల విలీనం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా తయారు చేసిందన్నారు. అప్పటి ప్రతిపక్ష హోదాలో వైసీపీ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా తప్పు పట్టిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం, తాము అధికారంలోకి రాగానే జీవో 117 ను రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో 117 స్థానంలో జీవో 20 ని అమలు చేశారే తప్ప విధానాల్లో మాత్రం మార్పు లేదన్నారు. పాలకవర్గాలు విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకునేందుకు ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్నారన్నారు. వివిధ యాప్ల పేరుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందకుండా చేయడంలో పాలకవర్గాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ లాంటి సంస్థల ఆదేశాల మేరకే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్య అందకుండా చేస్తూ మరోవైపు ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోకి తరలి వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నారన్నారు. సాల్ట్ పథకం అమలులో భాగంగా ప్రపంచ బ్యాంకు నుండి 1750 కోట్లు అప్పు తీసుకున్న ప్రభుత్వం వారితో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రభుత్వ పాఠశాలలను, ఉపాధ్యాయులను కుదించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే సాక్షాత్తు విద్యాశాఖ కమిషనర్ రాష్ట్రంలోని ఉన్న 43 వేల పాఠశాలల నుండి 11 వేల పాఠశాలను కుదిస్తామని ప్రకటించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,70,000 ఉపాధ్యాయ పోస్టులను 1,10,000 పోస్టులకు కుదించేందుకు ఆలోచన చేస్తున్నారన్నారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యను నిర్వీర్య పరుస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందకుండా చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ముస్తాబు చేసిందని, కానీ బోధనేతర కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సైతం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తూ, మరోపక్క ప్రభుత్వ విద్యా రంగంపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో 17వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతున్నాయని, 2020 నాటికి ప్రభుత్వ పాఠశాలలో 46 లక్షల మంది విద్యార్థులు కొనసాగుతుండగా 2025 నాటికి 31.50 లక్షల మందికి మంది మాత్రమే ఉన్నారని, ప్రస్తుతానికి ఆ సంఖ్య 29.30 లక్షల మందికి పడిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగకుండా కుట్రలు చేస్తూ, మరోపక్క ప్రభుత్వ పాఠశాలలో సంఖ్య తగ్గిపోవటానికి ఉపాధ్యాయులే కారకులని చిత్రీకరించేందుకు పాలకుల ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోకపోతే, పేదలకు ప్రభుత్వ విద్య దూరమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు "ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మాసం నుండే ప్రభుత్వ బడుల్లో ఎన్రోల్మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నాలుగు దశలుగా నిర్వహించాలని, నిర్ణయించామని ఆ మేరకు మొదటి దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించామని, రెండవ దశలో మండల స్థాయి సమావేశాలు, మూడవ దశలో ఇంటింటి ప్రచారం చేపట్టనున్నామని, నాలుగవ దశలో ప్రజా సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాన్ని యుటిఎఫ్ భుజానికెత్తుకొని ముందుకు వెళ్తున్నా పాలకుల నుండి ఎలాంటి ప్రోత్సాహం లేదన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు పాఠశాలల్లో ఉదయం ఒక గంటపాటు, సాయంత్రం ఒక గంటపాటు అదనంగా పనిచేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బి.రాజశేఖర్ రాహుల్, యుటిఎఫ్ జిల్లా జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, ట్రెజరర్ కె.నరసింహారావు. జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహమ్మద్, జి.గోపీనాథ్, ఎ.డి.దేవ దత్తం, డి.సుబ్బారావు, జె.వి.సుబ్బారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మహబూబాబాద్ కలెక్టర్ బదిలీ
## గిరిజన, బీసీ సంఘాల సంబరాలు

మహబూబాబాద్ గురువారం జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బదిలీ అవ్వడంతో, బీసీ, గిరిజన సంఘాలుభారీ ఎత్తున టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నాయి.కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా అభివృద్ధిని అడ్డుకుని, జిల్లాను నాశనం చేశాడని ఆరోపిస్తూ అతనికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

## ఎమ్మెల్సీ సోము వీర్రాజు పై దాడికి వైకాపా ఎమ్మెల్సీల యత్నం

అమరావతి బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై దాడి చేయడానికి వైసీపీ ఎమ్మెల్యేలు ప్రయత్నించడం గురువారం శాసనమండలిలో హాట్ టాపిక్ గా మారింది. రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను ఆపించామని ప్రకటించారని..దానిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వచ్చిన ప్రశ్నలో భాగంగా ఈ చర్చ వచ్చింది. సభ్యులు మాట్లాడిన తర్వాత మంత్రి సమాధానం ఇచ్చారు . సమాధానం అయిపోయిన తర్వాత తదుపరి ప్రశ్నకు మండలి చైర్మన్ వెళ్లారు. అయితే రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్న కు సమాధానం పూర్తయినందున ఇక దానిపై చర్చ ఉండదని చెప్పిన మండలి చైర్మన్ తదుపరి ప్రశ్న అడిగేందుకు..సోము వీర్రాజుకు అవకాశం కల్పించారు.సోము వీర్రాజు లేచి తన ప్రశ్న అడిగే సమయంలోనే వైసీపీ సభ్యులు ఆయన వైపు దూసుకొచ్చారు. ప్రశ్న అడగకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయెల్ సోము వీర్రాజుపై దాడికి ప్రయత్నించారు. ఆయనకు పోటీగా ఇతర ఎమ్మెల్సీలు దూసుకొచ్చారు. అయితే సోము వీర్రాజుకు రక్షణగా హోంమంత్రి అనితతో పాటు ఇతర టీడీపీ సభ్యులు నిలబడ్డారు. ఈ క్రమంలో తీవ్ర గందరగోళం ఏర్పడటంతో చైర్మన్ కొద్ది సేపు మండలిని వాయిదా వేశారు. వైసీపీ ఎమ్మెల్సీల తీరు వివాదాస్పదమయింది.

## పోక్సో కేసులో ఇద్దరికి శిక్ష, జరిమానా

రాజన్న సిరిసిల్ల మైనర్ బాలిక పై బలవంతపు వేధింపుల (పోక్సో) కేసులో ఇద్దరు నిందితులకు నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 2000/-రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ గురువారం రోజున తీర్పు వెల్లడించారు.
ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఒక మైనర్ బాలికను 2021 సంవత్సరంలో వరుసకి అన్న అయిన మైనర్ బాలుడు బలవంతపు వేధింపులకు గురి చేసాడు. బాలుడి తండ్రి జానీ, నానమ్మ పొచవ్వ లు ఎవరికైనా చెప్తే చంపేస్తాం అని బాధితులని బెదిరించారు. విషయం పై బాధితురాలి యెక్క తల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసింది. అప్పటి ఎస్.ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేయగా దర్యాప్తు తరువాత అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసినాడు కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల పోక్సో కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ ఇద్దరు నిందితులు తూర్పటి జానీ,తూర్పటి పొచవ్వకి నాలుగు సంవత్సరల జైలు శిక్ష తో పాటు ఒక్కక్కరికి 2000/- రూపాయల జరిమానా విధించారు. ప్రధాన నిందితుడు మైనర్ కావడం వలన అతని మీద కేసు ప్రస్తుతం జువెనైల్ కోర్టులో నడుస్తుంది..

## మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ గా భార్య, ఎస్పీ గా భర్త



మహబూబాబాద్ జిల్లా నూతన కలెక్టర్ గా స్నేహ శబరీష్ ను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఇంతకుముందు హన్మకొండ జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్న ఆమెను మహబూబాబాద్ కు బదిలీ చేశారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పని చేస్తున్నారు. ఇప్పుడు జిల్లాకు నూతన కలెక్టర్ కు శబరీష్ భర్త కావడంతో, భార్యాభర్తలు ఒకే జిల్లాలో ఉన్నత పదవుల్లో పనిచేయనున్నారు.

## ఘనంగా బడే సాహెబ్ ఖాద్రి ఉరుసు మహోత్సవం.

సి. బెలగల్ ఫిబ్రవరి 26. మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో జర్ జరీబడే సాహెబ్ ఖాద్రి మరియు బిబి ఫాతిమాల 80వ ఉరుసు మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దర్గా పీఠాధిపతులు సయ్యద్ మసూద్ భాష, సయ్యద్ చాంద్ బాషా ఇంటి నుండి గంధం కార్యక్రమాన్ని తెల్లవారుజామున 4.30 ప్రారంభించి ఉదయం 7 గంటలకు ముగించారు. ఈ గంధం కార్యక్రమం గ్రామంలోని పుర వీధుల గుండా మేళతాళాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించి గ్రామంలోని ప్రజలు స్వామివారికి కాయ కర్పూరాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం దర్గా పీఠాధిపతులు చదివింపుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## మంత్రి పొన్నం తో ప్రొఫెసర్ కోదండరాంచ తెలంగాణ ఉద్యమకారుల భేటి

హైదరాబాద్ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం కానుంది. ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేసారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి త్వరలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయనుందన్నారు. కమిటీకి సంబంధించిన విధి విధానాలు ఉద్యమకారుల హామీలు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారులు చర్చించారు.

## పత్రిక ప్రకటన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

రామగుండం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, మంచిర్యాల పట్టణం లోని పలు పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది బందోబస్త్, పెట్రోలింగ్ చేస్తూ పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీపీ వెంట మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ మంచిర్యాల ఏసిపి ఆరు ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోదరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కన్నీటి పర్యంతమైన మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు...



జయశంకర్ భూపాలపల్లి.ఫిబ్రవరి 26, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం, నవాబ్పేట గ్రామ వాస్తవ్యులు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సతీమణి కసిరెడ్డి రమ క్యాన్సర్ వ్యాధితో స్వర్గస్థులయ్యారు. ఈ విషయం తెలిసి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ ఱ భూపాలపల్లి జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి నవాబ్పేట గ్రామానికి చేరుకుని మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సంఘటనతో గండ్ర జ్యోతి కన్నీటి పర్యంతమయ్యారు.ఈ కార్యక్రమంలో చిట్యాల మండల మరియు స్థానిక బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కుమ్మేర ఘటనపై తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం తీవ్ర ఆగ్రహం.

### ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్యాల స్వామి



జయశంకర్ భూపాలపల్లి.ఫిబ్రవరి 26, కుమ్మేర మల్లన్న జాతరలో 2 నెలల పసి పాపను కాలుతో తొక్కి చంపిన ఘటనపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో నిర్వహించిన వేలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్యాల స్వామి మాట్లాడుతూ...కులం పేరుతో కులాహంకరం. కులం అంటే ఏంటో తెలియని వయసు దేవుడంటే ఎవరో తెలియని పసి మనసు గుడిలోకి అడుగుపెట్టింది అని ఆ తల్లికి ఆమె చేతిలో ఉన్న 2నెలల పాపకు ఈ అగ్రవర్ణ రెడ్ల కులస్తుల సమాజం చేసిన అన్యాయం ఇది అంతే కాకుండా ఈ వ్యవస్తులు ఎవరికోసం పని చేస్తున్నాయి అని మండ్డిపడ్డారు ఆ పాప చావుకు కారణం ముమ్మాటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వ హత్యగా ఎరుకల సంఘం తరుపున తీవ్రంగా కండ్డీస్తున్నాం ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ పాప చావుకు కారణమైన వారిని వెంటనే ఊరి తియ్యాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాం లేకుంటే పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తాం అని హెచ్చరిస్తున్నాం అంతేకాకుండా అధికార పార్టీ అండ ఉందని బీసీ కులాలపై అలాగే ఎస్సి, ఎస్టీ కులస్థులను తక్కువ జాతి కులస్థులని అగ్రవర్ణ కులస్థులు దాడికి దిగితే కాలు కింద వేసి తొక్కుతాం అని హెచ్చరించారు.

## కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

సికింద్రాబాద్. ప్రభుత్వంతో పాటు సామాజిక సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు సమాజ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మారేడుపల్లిలో నూతనంగా పునర్నిర్మాణమైన పద్మశాలి ఏసీ కళ్యాణ మండపం ను కిషాన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సంఘం సభ్యులు అంతా ఒక తాటి మీదికి వచ్చి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు.. పలు సేవా కార్యక్రమాలతో వారి కంటూ ప్రత్యేక గుర్తింపును పద్మశాలి సంఘం దక్కించుకుందని, వారికి ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలు అందుతాయంటూ కిషన్ రెడ్డి హామినిచ్చారు. ప్రభుత్వంపైనే ఆధారపడకుండా స్వచ్ఛంద సేవ సంస్థలు, కుల సంఘాలు తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, నిరు పేదలను ఆదుకోవాలని కేంద్రమంత్రి కోరారు.

## ఘనంగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయం ప్రారంభం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేటఎమ్మెల్యే డాచదలవాడ అరవింద బాబు



నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోఫ్ట్‌వేర్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డా??చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రంథాలయాల ఆధునికీకరణకు మరియు డిజిటల్ సేవల విస్తరణకు ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుని, ఎమ్మెల్యే డా??చదలవాడ అరవింద బాబు దుస్సాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఎమ్మెల్యే డా??చదలవాడ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా??చదలవాడ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయ వ్యవస్థను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. డిజిటల్ గ్రంథాలయాలు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థులు, ఉద్యోగార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రంథాలయాలను కేవలం పుస్తకాల కేంద్రాలుగా కాకుండా జ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. యువతలో చదువు పట్ల ఆసక్తి పెంపొందించేందుకు గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మరియు అధికారులను ఎమ్మెల్యే డా??చదలవాడ అభినందించారు.

## అనూరియా బాధితులకు మంత్రి కందుల దుర్గేష్ మనో ధైర్యం

**రాజమహేంద్రవరం కిమ్స్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్**

**బాధితుల భుజం తట్టి, కరచాలనం చేసి అండగా ఉంటామని హామీ...**

**సంతోషం వ్యక్తం చేసిన బాధితులు**

**నిందితులపై కఠిన చర్యలు తప్పవు**

**– బాధితులకు రూ. 10 లక్షల పరిహారం**

**మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో చికిత్స**

**రాజమహేంద్రవరంలోనే అధునాతన టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడి**

రాజమహేంద్రవరం :రాజమహేంద్రవరం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ పాల ఘటన (అనూరియా) బాధితులను రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ గురువారం స్వయంగా పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి దుర్గేష్.. వెంటిలేటర్లపై ఉన్న వారికి ధైర్యం చెప్పారు. కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబాలను ఓదార్చి, బాధితుల భుజం తట్టి, కరచాలనం చేసి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ కీలక అంశాలను వెల్లడించారు.

బాధితులకు భరోసా

– మెరుగైన వైద్యం:ఈ ఘటన అత్యంత హృదయవిదారకం. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులతో సహా మొత్తం 15 మంది ఈ ప్రభావానికి లోనయ్యారు. ప్రస్తుతం 8 మంది బాధితులు చికిత్స పొందుతుండగా, అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ కోలుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా బాధితులకు రూ. 10 లక్షల పరిహారం ప్రకటించారు. వైద్యానికి అయ్యే ప్రతి పైసా ప్రభుత్వమే భరిస్తుంది అని తెలిపినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

ప్రత్యేక వైద్య బృందం

– 'ఫోమి ఫీజోల్' డ్రగ్:

డాక్టర్ సుధాకర్ నేతృత్వంలో కిమ్స్ ఆస్పత్రిలో బాధితులకు మెరుగైన వైద్యం అందుతోంది. ఈ విభాగంలో నిపుణుడైన డాక్టర్ రవిరాజా పర్యవేక్షణలో బాధితులకు చికిత్స అందిస్తున్నాం. ఇటువంటి సమస్యలకు సమర్థవంతంగా పనిచేసే 'ఫోమి ఫీజోల్' అనే డ్రగ్ వాడకం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఎంతో చొరవ చూపి ఈ మెడిసిన్ అందుబాటులోకి తెప్పించారని మంత్రి దుర్గేష్ కొనియాడారు.

కల్తీ రాయుళ్లకు మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరిక:

కల్తీకి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు. ఇప్పటికే నమూనాలు సేకరించాం, నివేదికలు రాగానే బాధ్యులపై ఉక్కుపాదం మోపుతాం. వ్యాపారస్తులు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడకూడదు, నిర్దేశిత ప్రమాణాలను పాటించాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మంత్రి దుర్గేష్ హెచ్చరించారు.

భవిష్యత్ ప్రణాళిక:

విశాఖలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందడం బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. పరీక్షల నిమిత్తం వేరే రాష్ట్రాలకు వెళ్లకుండా, రాజమహేంద్రవరంలోనే అత్యాధునిక టెస్టింగ్ సెంటర్ నెలకొల్పాలన్న విజ్ఞప్తిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. ప్రజలు కూడా ఆహారం, పాలు, నీరు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు

## ట్రైనీ టీచర్స్ కు సత్కారం



రాయచోటి, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గం లోని సంబేపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్ లో గురువారం ట్రేని టీచర్లకు అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు .గత 25 రోజులుగా టీచర్ ట్రైనింగ్ నిమిత్తము వచ్చిన ముగ్గురు ట్రైనీ టీచర్స్ కు పాఠశాల హెడ్మాస్టర్ వెంకటయ్య పసుపు కుంకుమ చీరతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు వెంకటయ్య మాట్లాడుతూ వీరు గత 25 రోజుల నుంచి పాఠశాలలో క్రమశిక్షణతో పిల్లలకు సులభతరమైన రీతిలో విద్యాబోధన చేశారని, దీర్ఘకాలంగా పాఠ్యాంశాలు గుర్తుండిపోయే విధంగా విద్యను నేర్పించారని వారిని అభినందించారు . ఈ ముగ్గురు ట్రైనీ టీచర్స్ ను మరింత ప్రోత్సహించేందుకే ఈ చిరు సత్కారాన్ని చేయడం జరిగిందని చెప్పారు . నేటి ఈ ట్రైనింగ్ టీచర్స్ రేపటి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అవుతారని అందుకు ఇప్పటినుండే డీఎస్సీకి కార్యాచరణగా సిద్ధమవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయమ్మ, రెడ్డన్న ,రెడ్డయ్య రాజు, నాగేశ్వర్ నాయక్, ఎమ్మార్సీ సిబ్బంది అయ్యి ఆర్ టి సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన గరిమ అగ్రవాల్

### శుభాకాంక్షలు తెలియజేసిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అధికారులు



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఫిబ్రవరి 26 : జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ అక్టోబర్ 23 వ తేదీ 2025 న బాధ్యతలు స్వీకరించారు. గరిమ అగ్రవాల్ ను కలెక్టర్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కు అర్చకులు ఆశీర్వచనం అందించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారుకార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రావణ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట పురపాలక సంఘం 2026-27 సంవత్సరంకు మొత్తం బడ్జెట్: 181.99 కోట్లు

సిద్దిపేట గురువారం సిద్దిపేట పురపాలక సంఘం లో జరిగిన బడ్జెట్ సమావేశాలకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు మరియు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట్రావ్ బడ్జెట్ ప్రసంగము చేయగా కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ఆమోదించడం జరిగింది.2026-2027 బడ్జెట్ వివరాలు:2026-2027 సంవత్సరానికి సంబందించిన 181.99 కోట్ల అంచనాల బడ్జెట్ ను మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు సమావేశ మందిరంలో ప్రవేశపెట్టగా పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా తమ ఆమోదాన్ని తెలియజేసారు.మొత్తము అంచనా వేసిన ఆదాయం 2026-27 సంవత్సరానికి గాను రూ 181 కోట్ల 99 లక్షల 50 వేలు కాగా 2026 -27 ఆర్థిక సంవత్సరానికి చేయబోయు అంచనాల వ్యయం 181 కోట్ల 93 లక్షలు. మిగులు వ్యయం 6.10 లక్షలు.మొత్తము సాధారణ ఆదాయం 52.96 కోట్లుగా కేటాయించారు.మొత్తము సాధారణ వ్యయం 52. 93 కోట్లుగా కేటాయించారు. సాధారణ వ్యయములో 1/3 వంతు వెనుకబడిన మురికివాడల, విలీన గ్రామాలు మొదలగు మౌళిక వసతుల అభివృద్ధికి 2.73 కోట్లు కేటయించారు.మొత్తము సాధారణ బడ్జెట్ లో 10 శాతం హరిత బడ్జెట్ కు 5.29 కోట్లు కేటయించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.సిద్దిపేట మున్సిపాలిటీ 2026-27 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను ప్రతిపాదించడం జరిగింది. దీనికి సంబంధించి సాధారణ ఆదాయం ఇతరత్ర మార్గాల ద్వారా మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వ్యయాలను బడ్జెట్ లో సంపూర్ణంగా వివరించడం జరిగింది. మొత్తము అంచనా వేసిన ఆదాయం 2026-27 సంవత్సరానికి గాను రూ 181 కోట్ల 99 లక్షల 50 వేలు నిర్ణయించడం జరిగిందని దీని ఆమోద నిమిత్తం ప్రభుత్వనికి ప్రతిపాదనలు అందించనున్నట్లు తెలిపారు. వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టినీదకు సిద్దిపేట మున్సిపల్ ఛైర్పర్సన్, పాలకవర్గం సభ్యులకు మరియు అధికారులకు అభినందనలు తెలియజేశారు.

## బాల్య వివాహ రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**జిల్లాను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రెవెన్యూ గార్డెన్ లో బాల్య వివాహ నిరోధక అధికారులకు నిర్వహించిన అభయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ, మండల మరియు పట్టణ స్థాయిల్లో బాలల సంరక్షణ కమిటీలు ప్రతి నెలా విధిగా సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశాల మినిట్స్ బుక్‌ను పక్కాగా నిర్వహించాలని, బాధ్యతల మార్పిడి సమయంలో ఈ రికార్డులను అప్పగించాలని స్పష్టం చేశారు. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్న 'హాట్ స్పాట్' ప్రాంతాలను గుర్తించి, అక్కడ వివాహాలు జరగడానికి గల మూల కారణాలను విశ్లేషించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళా జాతరలు, రంగోలి పోటీలు, వ్యాస రచన పోటీలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. వివాహాలకు



సహకరించే పురోహితులు, ఇమామ్‌లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, క్యాటరర్లు, శుభలేఖలు ముద్రించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎఫ్.ఐ.ఆర్ (ఖీ×=) నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల గురించి సమాచారం ఇచ్చే వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. బాల్య వివాహ రహిత పంచాయతీలను ప్రకటించేందుకు 'బాల వివాహ ముక్త భారత్' పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఉత్తమంగా పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు, అధికారులకు జిల్లా యంత్రాంగం తరపున ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేస్తామని, బాల్య వివాహ రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆయన కోరారు.

అనంతరం బాల్య వివాహాల నిషేధం పై సీఎంపిఓ లతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేసి, కార్యక్రమానికి సంబంధించిన సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులతో కలిసి ఆయన ఫోటోలు దిగారు.ఈ అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మిల్కా, డీసీపీఓ రాజేంద్ర ప్రసాద్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటి సభ్యులు సభ్యులు బాల్ చందర్, వెంకటస్వామి, సమీర్ ఖాన్, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, సిడిపిఓలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ×జురా, 1098, సఖి కేంద్రం, సూర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయిలో సంగారెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ కు అవార్డుల పంట



లయన్స్ భవన్ సికింద్రాబాద్ నందు జరిగిన 2024-25 సంవత్సరం EMPOWER 320 D డిస్ట్రిక్ట్ అవార్డు ల కార్యక్రమములో లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ కు జిల్లా స్థాయిలో
Best Membership Growth, Excellence Based Activities, Out standing Media&Publicity, Out Standing Calender of Events, అవార్డు లను మరియు వ్యక్తిగత
లయన్ అనంతరావు కులకర్ణి గారికి District Chairperson (DC Communication )అవార్డు
లయన్ మంగళపర్తి వెంకటేశం గారికి Zone Chairperson అవార్డు
లయన్ నాయికోటి రామప్ప గారికి Best Secretary అవార్డు
లయన్ శేషత్వం క్రిష్ణ గారికి Outstanding Tresurer అవార్డు లను
డిస్ట్రిక్ట్ గవర్నర్ చేతుల మీదుగా బహుకరించిన బహుమతులను
ఙజ అనంతరావు కులకర్ణి మరియు ఙజ మంగళపర్తి వెంకటేశం గార్లు అందుకున్న శుభసందర్భములో
అవార్డు గ్రహీతలను మరియు అధ్యక్షులు జార్జ్ మ్యాథ్యూ మరియు కార్యవర్గాన్ని డిస్ట్రిక్ట్ చైర్మన్లు లయన్స్ పి. రాములుగౌడ్, యస్. విజయెందర్ రెడ్డి, డి. హన్మంత్ గౌడ్, అధ్యక్షులు పి. రామక్రిష్ణా రెడ్డి మరియు యం. సునీల్ కుమార్, లాడే మల్లేశము మరియు ఇతర లయన్స్ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.
లయన్ మంగళ పర్తి వెంకటేశం డిస్ట్రిక్ట్ చైర్మన్

# సదరన్ ట్రావెల్స్‌కు 'మోస్ట్ ప్రిఫర్డ్ అవుట్‌బౌండ్ ట్రావెల్ బ్రాండ్'గా 4వ సారి VETA అవార్డు



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన మరియు ట్రావెల్ బ్రాండ్లలో ఒకటైన సదరన్ ట్రావెల్స్‌కు "మోస్ట్ ట్రస్టెడ్ అవుట్‌బౌండ్ ట్రావెల్ బ్రాండ్" కేటగిరీలో ప్రతిష్టాత్మకమైన VETA ట్రావెల్ అవార్డు--2026 లభించింది. ఈ అవార్డును 24 ఫిబ్రవరి 2026న న్యూఢిల్లీలోని ITC మౌర్య హోటల్‌లో జరిగిన ఘన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పరిశ్రమ నాయకులు, ట్రావెల్ నిపుణులు, గౌరవ అతిథులు హాజరయ్యారు. పర్యాటక రంగంలో వినూత్నత, సేవా నాణ్యత, పరిశ్రమలో నాయకత్వ లక్షణాలను గుర్తించి ప్రదానం చేసే అత్యంత ప్రతిష్టాత్మక అవార్డుల్లో VETA ట్రావెల్ అవార్డు ఒకటి. 56 సంవత్సరాలుగా సదరన్ ట్రావెల్స్ 2000కు పైగా దేశీయ, అంతర్జాతీయ హాలిడే ప్యాకేజీలు, కార్పొరేట్ ట్రావెల్ సొల్యూషన్స్, కస్టమైజ్డ్ టూర్ సేవలను అందిస్తూ రంగంలో పయనీర్‌గా నిలిచింది.

ఈ సందర్భంగా సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కృష్ణ మోహన్ అలపాటి మాట్లాడుతూ, "VETA ట్రావెల్ అవార్డు--2026 అందుకోవడం మా కోసం గర్వకారణం. ఈ గుర్తింపు ట్రావెల్ రంగంలో మా నిబద్ధతను మరింత బలపరుస్తుంది. మా విజయాన్ని మా కృషిశీలమైన టీమ్‌కు, మా సేవలను నమ్మి ఎప్పుడూ మాతోనే ఉండే వినియోగదారులకు అంకితం చేస్తున్నాం. ఈ గుర్తింపుతో మాకు మరింత బాధ్యత పెరిగింది. భవిష్యత్తులో సేవలను మరింత మెరుగుపరుస్తూ కొత్త మైలురాళ్లు సాధిస్తాం" అని అన్నారు.

దేశవ్యాప్తంగా బలమైన స్థానం కలిగిన సదరన్ ట్రావెల్స్, 4.5 మిలియన్లకు పైగా ప్రయాణికులకు స్మరణీయమైన ప్రయాణ అనుభవాలను అందిస్తూ ట్రావెల్ రంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆధునిక సాంకేతికత, వ్యక్తిగత ట్రావెల్ ప్లానింగ్, ఉత్తమ అతిథి సత్కారంతో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలను అందిస్తోంది.

ఈ అవార్డు సదరన్ ట్రావెల్స్‌ను విశ్వసనీయమైన ట్రావెల్ భాగస్వామిగా మరింత బలపరుస్తూ పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపింది. భవిష్యత్తులో సేవలను విస్తరించడం, వినియోగదారుల అనుభవాన్ని మరింత మెరుగుపరచడం, ట్రావెల్ రంగంలో కొత్త ప్రమాణాలు నెలకొల్పడం సంస్థ లక్ష్యంగా కొనసాగుతుంది. Ph: 98480 23236

## ఆటిజం మరియు పిల్లల అభివృద్ధి కేంద్రాలకు నమోదు తప్పనిసరి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 26:** దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 లోని విభాగం 51 ప్రకారం దివ్యాంగులకు సేవలు, చికిత్స, శిక్షణ, పునరావాసం, సంరక్షణ లేదా మద్దతు అందించే అన్ని సంస్థలు తప్పనిసరిగా నమోదు చేసుకోవలసి ఉంటుందని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.కొన్ని కేంద్రాలు సంబంధిత అధికారుల నుండి అవసరమైన నమోదు పొందకుండానే పనిచేస్తున్నట్లు గమనించబడింది. అటువంటి కేంద్రాలన్నీ వెంటనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు.

చట్టంలోని నిబంధనలను పాటించని పక్షంలో సంబంధిత కేంద్రాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి. అవసరమైతే కేంద్రాలను మూసివేయడం మరియు స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు కూడా చేపట్టబడతాయి.అందువల్ల సంబంధిత సంస్థలు ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి ఎలాంటి శిక్షార్హ పరిణామాలు ఎదురుకాకుండా వీలైనంత త్వరగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా సంక్షేమ అధికారి విజ్ఞప్తి చేశారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య తొలి హైటెక్ హైవే

హైదరాబాద్, ఫిబ్రవరి 26, తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే వారికి గుడ్‌న్యూస్. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లే వాహనదారులు ఎగిరిగంతేసే వార్త. ఎందుకంటే త్వరలోనే మరో కొత్త హైవే అందుబాటులోకి రానుంది. ఖమ్మం-దేవరపల్లి మధ్య హైటెక్ హంగులతో నిర్మించిన హైవేను మే నెలలో ప్రారంభించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు చేస్తోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే హైదరాబాద్-విశాక 56 కి.మీ దూరం తగ్గనుంది.తెలంగాణ-ఏపీ మధ్య ప్రయాణాలు సాగించేవారికి గుడ్‌న్యూస్. త్వరలోనే మరో గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-శ్రీశైలం నేషనల్ హైవేలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ హైవేలపై రద్దీ పెరగటంతో తెలుగు రాష్ట్రాలను కలుపుతూ మరో హైవేను నిర్మించారు. ఖమ్మం- ఏపీలోని దేవరపల్లి మధ్య నిర్మించిన మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే త్వరలోనే వాహనదారులకు అందుబాటులోకి రానుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హైటెక్ హంగులతో నాలుగు వరుసలుగా ఈ రోడ్డు రెడీ అవుతోంది.తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం అనేక గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేలు నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో మొదటిదిగా.. తెలంగాణలోని ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు 162.04 కి.మీ. పొడవున చేపట్టిన ఈ రహదారికి ఎన్‌హెచ్‌ఏఐ తుదిమెరుగులు దిద్దుకుంటోంది. హైదరాబాద్ నగరం నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ప్రస్తుతం ఎన్‌హెచ్ 65పై సూర్యాపేట, విజయవాడల మీదుగా 676 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే 56 కి.మీ తగ్గనుంది. ఖమ్మం సమీపంలోని తల్లంపాడు నుంచి ఏపీలోని ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా దేవరపల్లి వరకు ఈ రోడ్డును నిర్మిస్తుండగా.. ఎన్‌హెచ్-365బీజీగా ఈ రహదారికి నంబరును కేటాయించారు.ఇక ఈ హైవే హెటెక్ హంగులతో రూపుదిద్దుకుంటోంది. సీసీ కెమెరాలు, సోలార్ ప్యానళ్లు, సమాచారాన్ని అందించే క్యూఆర్ కోడ్‌లు, అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ, ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్ వంటివి ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరానికే టోల్ వసూళ్లు చేయనున్నారు. పరిమిత సంఖ్యలో అంటే 19 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. దానికి తోడు ప్రతి 50 కి.మీ రోడ్డుకు రెండు వైపులా దాదాపు 5 ఎకరాల్లో స్థలంలో వాహనదారులు సేదతీరేందుకు ప్రత్యేక స్థలం కేటాయించారు

# మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 26:** మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్ (2021)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసి పూల మొక్క అందించారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు బదిలీ పై నియమితులయ్యారు.

# రెండవ పీఆర్సి ని వెంటనే అమలు చేయాలి

## కనీస వేతనం 26 వేలు చేయండి

## మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నాయకులు



**ప్రజాబలం దినపత్రిక వేములవాడ ఫిబ్రవరి -26** వేములవాడ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రెండవ పీఆర్సి ని వెంటనే అమలు చేయాలని కనీస వేతనం ఒక్కరికి 26 వేల రూపాయలు పెంచాలని గురువారం రోజున మున్సిపల్ కమిషనర్ కే. సంపత్ కుమార్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలని పనిని బట్టి కేటగిరి వారిగా వేతనాలు చెల్లించాలని మరణించిన, అనారోగ్య పాలైన వయసు మీరిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, జనాభా ప్రతిపాదికన ప్రకారం కొత్త కార్మికుల్ని నియమించాలని, ఆదివారాల్లో పూర్తి సెలవుదినంగా ప్రకటించాలని, ఇండ్లు లేని కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, పిఎఫ్ ఈ ఎస్ఐ ఖాతాలలో జరుగుతున్న ఆవకతవకలను గుర్తించాలని, దశలవారీగా కార్మికులందరికీ న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని ఈ విషయమై మార్చి రెండవ తేదీన రాష్ట్ర పిలుపు మేరకు అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయల వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ ,వేములవాడ పట్టణ కమిటీ అధ్యక్షులు సరిపెల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి దొబ్బల లచ్చయ్య ,వర్కింగ్ ప్రెసిడెంట్ సావనపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు వావిలాల లక్ష్మి తదితరులు కార్మికులు పాల్గొన్నారు

# గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 :** గోదావరి పుష్కరాల నిర్వహణకు పూర్తి కార్యచరణ సిద్ధం చేయగలరు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా,డి.సి.పి.ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు లతో కలిసి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ, పోలీస్,రెవెన్యూ, వైద్య, విద్యుత్,మత్స్య,నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...గోదావరి పుష్కరాలు దక్షిణాది కుంభమేళా తరహాలో ఉంటాయని,ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి నది పరివాహకంలో



అనువైన ప్రాంతాలలో పుష్కరాల ఏర్పాట్ల కొరకు తీసుకుంటున్న చర్యలలో భాగంగా జిల్లాలోని గోదావరి నది తీర ప్రాంతాలలో పుష్కర ఘాట్ల ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి కార్యచరణ సిద్ధం చేయాలని తెలిపారు. అధిక సంఖ్యలో మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరంలో పుష్కర స్నానాలు ఆచరిస్తారని, తరువాత గూడెంలో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్థానాలకు హాజరవుతారని తెలిపారు.పార్కింగ్,హోల్డింగ్ ఏరియా,పండల్ ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, ప్రజా రవాణా వ్యవస్థ,డ్రోన్ ద్వారా పర్యవేక్షణ, పుష్కర ఘాట్ ప్రాంతాలలో లైటింగ్,త్రాగునీటి ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని, ఈ విషయమై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రితో సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రతిపాదనలు, కార్యచరణ సిద్ధం చేసి అందించాలని తెలిపారు. పుష్కరాలలో భక్తుల సంఖ్య అంచనా ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని,ఈ క్రమంలో మంచిర్యాలలో 2 లక్షల మంది, వేలాలలో 50 వేల మంది, చెన్నూరు ప్రాంతంలో సైతం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. నీటిపారుదల శాఖ నివేదిక ఆధారంగా నూతన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని,వెలుతురు, పారిశుద్ధ్యం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కార్యచరణ రూపొందించాలని తెలిపారు.భక్తుల సంరక్షణ దిశగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో పుష్కర స్నానాల ప్రాంతాలలో గజా ఈతగాళ్లను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని, పుష్కరాల నిర్వహణ కొరకు నోడల్ అధికారులను నియమించడం జరుగుతుందని తెలిపారు.కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు అంచనాలకు మించి భక్తులు వచ్చే అవకాశం ఉందని, కార్యచరణ రూపొందించడంలో జాగ్రత్తలు వహించాలని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యచరణ రూపొందించాలని,పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తదనగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.పుష్కర ఘాట్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి.ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్,రవాణా, జాతీయ రహదారులు,రోడ్లు భవనాలు,ఆర్.టి.సి.విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు.మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త,ఆటంకాలను వెంటనే తొలగించాలని,ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల,నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు,తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని,జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్,లైటింగ్,జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.రోడ్లపై అదుపు తప్పిన,ఓవర్ లోడెడ్ వాహనాలు,పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని,ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రమాదాల నివారణల భాగంగా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని,జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు.కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని,ప్రతి మండల,గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు,పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు.అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్,మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్,రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.డి.సి.పి.మాట్లాడుతూ... నూతన సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల నివారణను 20 శాతం మేర తగ్గించేలా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని,జిల్లాలో హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని,నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు.రహదారి ప్రమాదాలు,మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 :** జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల,టి.జి.ఎస్.డబ్ల్యూ. రెసిడెన్షియల్ పాఠశాల/జూనియర్ కళాశాల(బాలికలు)లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి ఇంటర్మీడియట్ పరీక్షల తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని,ఇందు కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది,ఒకేషనల్ 888 మంది విద్యార్థులు,ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది,ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు.పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్,సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలని, పరీక్ష సమయంలో 163 బి.ఎన్.ఎస్. ఎస్. సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా



టి.జి.ఎస్.ఆర్.టి.సి.అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు.అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడగల ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లంచం ..లంచం .. లంచం.. అవినీతి అపలేమా ?



హైదరాబాద్ ఫిబ్రవరి 26 ;అవినీతి ఆపలేమన్న నిజం నేడు ప్రతి సామాన్యుడికి అనుభవంగా మారింది. కార్యాలయం నుంచి రాజకీయాల వరకు, ఫైలు కదలాలంటే లంచం తప్పనిసరి అన్న భావన సమాజంలో బలంగా పాతుకుపోయింది. చట్టాలు ఉన్నా అమలు బలహీనంగా ఉండటం వల్ల అవినీతి నిర్భయంగా కొనసాగుతోందని ఎబివిపి బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్ ఆవేదన వ్యక్తం చేసారు.అధికారంలో ఉన్నవారు బాధ్యత మరిచి స్వార్థానికి పనిచేస్తే, సామాన్యుడు నిస్సహాయుడిగా మిగులుతున్నాడు. ఇది కేవలం వ్యవస్థ తప్పు మాత్రమే కాదు, మౌనంగా సహించేవారి తప్పు .అవినీతిని పూర్తిగా నిర్మూలించలేమనేది నిజమే కానీ, దానికి తలవంచి కూర్చోవడం మరింత పెద్ద నేరం. ప్రశ్నించే స్వరం తగ్గిపోవడం, "ఇలా అయితేనే పని అవుతుంది" అన్న ఆలోచన అవినీతిని బలపరుస్తోంది. యువత ముందుకు రావాలి, తప్పును ఎదుర్కొనే ధైర్యం చూపాలి. నిజాయితీగా పనిచేసే అధికారులు, పోరాడే పౌరులు కలిసి నిలబడితే అవినీతికి వణుకు పుడుతుంది. మార్పు పైనుంచి రావాలని ఎదురుచూడకుండా, ప్రతి ఒక్కరూ తన స్థాయి నుంచి పోరాటం మొదలుపెట్టాలి. అప్పుడే అవినీతిపై గెలుపు సాధ్య మవుతుందని సురేందర్ పేర్కొన్నారు.

## విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలి

### కళాశాలఇంచార్జీ ప్రిన్సిపల్ డాక్టర్ కే. రాజేంద్రం




**హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 26**విద్యార్థులు చదువుతోపాటు సాఫ్ట్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రాజేంద్రం అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ అధ్యక్షతన టాస్క్ (తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జీ) , నాంది సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మహేంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్ సాఫ్ట్ స్కిల్స్ పై మూడు రోజుల శిక్షణ తరగతుల గురువారం ప్రారంభమైయ్యాయి ఈ సందర్భంగా ఇంచార్జీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏరంగంలోనైనా విజయం సాధించడానికి సాఫ్ట్ స్కిల్స్ చాలా అవసరమని అన్నారు. శిక్ష తరగతులు నిర్వహంచడానికి నాంది ఫౌండేషన్ నుండి మాస్టర్ ట్రైనర్ డాక్టర్ చిరంజీవి వచ్చారని విద్యార్థులు ఈ శిక్షణా తరగతులకు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాయకులు సీ రాజ్ కుమార్,డా.కె.మాధవి మాట్లిడుతూ ఉద్యోగాలు సాధించటంలో సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యత గూర్చి వివరించారు. టీఎస్ కేసీ కో-ఆర్డినేటర్ కె. ఉమా కిరణ్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడంలో సాఫ్ట్ స్కిల్స్ ప్రధాన పాత్ర వహిస్తాయని అన్నారు ఈ కార్య క్రమంలో టీఎస్ కే సీ మెంటర్ శ్రీకాంత్, అధ్యాపకులు డా. శ్యామల, డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ఇ.రవి, మమత,సాయికుమార్, ప్రశాంత్,డాక్టర్ రవిప్రకాష్, డాక్టర్ సుష్మా ,అరుణ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహోన్నత చరిత్రకలిగిన ప్రాంతం "గాంధారి ఖిల్లా"

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 :** జిల్లాలోని మందమర్రి మండలంలోని గాంధారి ఖిల్లాకు మహోన్నత చరిత్ర ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో నాయక్పోడ్ సేవా సంఘం ప్రతినిధి పల్ల సత్యనారాయణ, పుస్తక రచయిత మేసినేని రాజన్న,నాయక్పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి గంజి రాజన్న,జిల్లా ప్రతినిధులు పెద్ది రాజన్న, గాంధారి మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి దైనేని రమేష్ లతో కలిసి గాంధారి ఖిల్లా చరిత్ర భాగం-1 పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పూర్వకాలం ఈ ప్రాంతంలో పాండవులు పర్యటించినట్లు చరిత్ర ఉందని,గిరిజనులు పాండవులను ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని తెలిపారు. తెలంగాణలో వనదేవతలను కొలిచే ఆచారం ప్రసిద్ధి పొందిందని,ఈ క్రమంలో గాంధారిఖిల్లా మైసమ్మను దేవతగా కొలుస్తారని తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన గాంధారి ఖిల్లా ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తక రచన చేయడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఏడుపాయల దుర్గామాత దర్శనం పూర్తి చేసుకున్న బిసి విద్యార్థి జాతీయసంఘం జాయింట్ కన్వీనర్ ఈశ్వర్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 26 (ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం గుండ్ల మర్పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బీసీ విద్యార్థిజాతీయ జాయింట్ కన్వీనర్ ఈశ్వర్ ఏడుపాయల దుర్గామాత దర్శనం పూర్తి చేసుకోవడం జరిగిందని తెలిపారు ఏడుపాయల దుర్గామాత ఆశీస్సులు వికారాబాద్ జిల్లా ప్రజల పైన మర్పల్లి మండలం గుండ్ల మర్పల్లి ప్రజల పైన ఎల్లవేళలా ఉండాలని సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఏడుపాయల దుర్గామాత దర్శనం చేసుకోవడం జరిగిందని తెలిపారు కార్యక్రమంలో యువకులు కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గొల్ల బీరప్ప యాదవ్ దర్శనం కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు

